RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో

తెలంగాణ సేన దినపత్రికలో పనిచేయుటకు

విలేకరులు కావలెను

జిల్లా రిపోర్టర్ లు, నియోజకవర్గ రిపోర్టర్ లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లు కావలెను.

9959236324    9951247932

PUBLISHED FROM : HYDERABAD | సంపుటి : 11 | సంచిక : 07 | బుధవారం 13 - 08 - 2025 | ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న ముదిరాజ్ | అసోసియేట్ ఎడిటర్ : కే రాజేంద్ర ప్రసాద్ | పేజీలు : 08 | వెల : 2 రూ/-

## సీఎం రేవంత్ రెడ్డి సర్కార్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత సూటి ప్రశ్న

- బీసీ రిజర్వేషన్లపై సీఎం రేవంత్ అఖిలపక్షాన్ని ప్రధాని వద్దకు ఎందుకు తీసుకువెళ్లలేదన్న కవిత
- త్వరలోనే బీసీ రిజర్వేషన్ల సాధన కోసం కార్యాచరణ ప్రకటిస్తానన్న కవిత
- బీసీలను వంచించాలని చూస్తున్న కాంగ్రెస్ కుయుక్తులను ప్రజల ముందు ఎండగడతామని వెల్లడి
- బీసీ రిజర్వేషన్ల అంశంపై పోరాటం చేస్తున్న కవిత నిన్న తెలంగాణ జాగృతి, యూపీఎఫ్, ఇతర బీసీ నాయకులతో సమావేశం నిర్వహించారు



బీసీ రిజర్వేషన్‌లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అఖిలపక్షాన్ని ప్రధానమంత్రి మోదీ వద్దకు ఎందుకు తీసుకువెళ్లలేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు,

## బండి సంజయ్‌కి కేటీఆర్ లీగల్ నోటీసులు

- ఫోన్ ట్యాపింగ్ కేసులో తనపై నిరాధార ఆరోపణలు చేశారన్న కేటీఆర్
- కేంద్ర మంత్రిగా ఉండి బాధ్యతారహితంగా మాట్లాడారని ఆగ్రహం
- రాజకీయ ఉనికి కోసం ఇలా దిగజారి మాట్లాడటం సరికాదన్న మాజీ మంత్రి
- బండి సంజయ్ వెంటనే క్షమాపణలు చెప్పాలని కేటీఆర్ డిమాండ్
- భవిష్యత్తులోనూ అసత్య ఆరోపణలు చేయకుండా ఉండాలని పేర్కొన్నారు




తెలంగాణలో సంచలనం సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో తాజాగా మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో తనపై నిరాధార - మిగతా 2 లో

# మూడు రోజులు ప్రభుత్వ సిబ్బందికి సెలవులు రద్దు

- భారీ వర్షాల దృష్ట్యా సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం
- వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని ఇన్‌ఛార్జ్ మంత్రులు, అధికారులకు సీఎం సూచన
- హైదరాబాద్‌తో పాటు వరద ప్రభావ జిల్లాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచన
- ముందస్తు చర్యలపై కలెక్టర్లకు సీఎం దిశానిర్దేశం
- ఆకస్మిక వరదలు వస్తే ఎయిర్ లిఫ్టింగ్‌కు హెలికాప్టర్లు ఉండేలా చూసుకోవాలని, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందితో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని అధికారులకు రేవంత్ రెడ్డి ఆదేశించారు
- హైదరాబాద్‌లో హైడ్రా సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలని, వరదల ప్రభావంపై ప్రజలు ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ ఆదిశించారు
- భారీ వర్షాల సమయంలో ప్రజలు బయటకు రాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, స్కూల్స్, కాలేజీలు, ఐటీ సెక్టార్ ఉద్యోగులకు సంబంధించి అధికారులు తగిన నిర్ణయం తీసుకోవాలని సూచించారు



తెలంగాణ రాష్ట్రంలో భారీ వర్షాలున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఇన్‌ఛార్జ్ మంత్రులు, అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచనలు చేశారు. మూడు రోజులు ప్రభుత్వ ఉద్యోగులకు సెలవులు రద్దు చేయాలని సీఎం ఉన్నతాధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌తో పాటు వరద ప్రభావ జిల్లాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని, నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసుల సేవలు వాడాలని సూచించారు. హైడ్రా అప్రమత్తంగా - మిగతా 2 లో

## ఆధార్‌ను ప్రామాణిక పత్రంగా భావించలేం

- సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్య
- ఆధార్‌పై సుప్రీంకోర్టు కీలక కామెంట్స్ చేసింది
- పౌరసత్వం జారీకి ఆధార్‌ను ప్రామాణికంగా అంగీకరించలేం
- పౌరసత్వం కోసం ఆధార్‌ను ప్రామాణిక పత్రంగా భావించలేమని ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాన్ని సర్వోన్నత న్యాయస్థానం సమర్థించింది
- ఓ నియోజకవర్గంలో 12 మంది చనిపోయారని ఈసీ చెప్పిందని, కానీ వారు బతికే ఉన్నారని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు
- ఇటువంటి ప్రక్రియలో కొన్ని లోపాలు ఉంటాయని ఈసీ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేదీ ధర్మాసనానికి విన్నవించారు



ఆధార్‌పై సుప్రీంకోర్టు కీలక కామెంట్స్ చేసింది. పౌరసత్వం కోసం ఆధార్‌ను ప్రామాణిక పత్రంగా భావించలేమని ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాన్ని సర్వోన్నత న్యాయస్థానం సమర్థించింది. అయితే, దీనిని స్వతంత్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్ల విచారణ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని బెంచ్ ఈ మేరకు వ్యాఖ్యానించింది. కేంద్ర ఎన్నికల సంఘం చెబుతున్నది సరైనదే. పౌరసత్వం జారీకి ఆధార్‌ను ప్రామాణికంగా అంగీకరించలేం. దీనిని కచ్చితంగా పరిశీలించాల్సి ఉంటుంది. అయితే, కేంద్ర ఎన్నికల సంఘానికి ఇందుకు అధికారం ఉందా అన్న అంశాన్ని మొదటగా నిర్ణయించాలి. ఒకవేళ ఈసీకి అధికారం లేకపోతే ఏ సమస్య ఉత్పన్నం కాదు. కానీ వారికి అధికారం ఉంటే మాత్రం అనేక సమస్యలు ఎదురవుతాయి. ఈసీ తీసుకున్న నిర్ణయం వల్ల అనేక మంది ఓటర్లు జాబితా నుంచి తొలగిపోయే - మిగతా 2 లో


## ట్రంప్ టారిఫ్ దెబ్బ అమెరికాలో మోతెక్కిపోతున్న ధరలు!




- ట్రంప్ సుంకాలతో అమెరికాలో నిత్యావసరాల ధరలకు రెక్కలు
- 7 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త టారిఫ్‌లతో పెరిగిన రేట్లు
- ఒక్కో కుటుంబంపై ఏటా రూ.2.11 లక్షల భారం పడుతుందని అంచనా
- భవిష్యత్ భయంతో ముందుగానే వస్తువులు కొంటున్న ప్రజలు
- దిగుమతులను తాత్కాలికంగా నిలిపివేసిన అమెజాన్, వాల్‌మార్ట్
- పాత స్టిక్కర్లపైనే కొత్త ధరల స్టిక్కర్లు అతికించి అమ్మకాలు

## అమరావతిలో బసవతారం ఆసుపత్రికి శంకుస్థాపన

అమరావతిలో బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రికి రేపు శంకుస్థాపన చేయనున్నారు. తుళ్లూరు - అనంతవరం గ్రామాల మధ్య ఈ ఆసుపత్రిని నిర్మించబోతున్నారు. బసవతారకం ఆసుపత్రి కోసం 21 ఎకరాల భూమిని సీఆర్డీయే కేటాయించింది. రేపు ఉదయం 9.30 గంటలకు శంకుస్థాపన చేయనున్నారు. - మిగతా 2 లో



- అమరావతిలో బసవతారకం ఆసుపత్రికి 21 ఎకరాల కేటాయింపు
- శంకుస్థాపన కార్యక్రమానికి హాజరుకానున్న బాలకృష్ణ, కుటుంబ సభ్యులు
- తొలి దశలో 300 పడకల సామర్థ్యంలో ఆసుపత్రి నిర్మాణం


## 2027 నాటికి పోలవరాన్ని పూర్తి చేయడమే లక్ష్యం




- 2027 డిసెంబర్ నాటికి పోలవరాన్ని పూర్తి చేయడమే లక్ష్యమన్నారు మంత్రి నిమ్మల రామానాయుడు
- ప్రాజెక్టు పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారుల్ని ఆదేశించారు
- డయాఫ్రం వాల్ పొడవు 1396 మీటర్లకు 500 మీటర్ల నిర్మాణం పూర్తయినట్లు తెలిపారు
- అలాగే 3 ట్రెంచ్ కట్టర్లు, 3 గ్రాబర్లలో డయాఫ్రంవాల్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి

# అమరావతి పనులు రికార్డు సమయంలో పూర్తి కావాలి

- అమరావతి నిర్మాణ పనుల పురోగతిపై సీఎం సమీక్ష
- మొత్తం రూ. 81,317 కోట్ల విలువైన పనులకు సీఆర్డీఏ ప్రతిపాదన
- ఇప్పటికే రూ. 50,552 కోట్ల పనులకు టెండర్లు పూర్తి
- సమీక్షకు హాజరైన మంత్రి నారాయణ, ఉన్నతాధికారులు, కాంట్రాక్టర్లు
- భవనాలు, రోడ్లు, వరద నియంత్రణ పనులపై చర్చ
- రాజధాని నిర్మాణాన్ని అత్యంత ప్రాధాన్య అంశంగా పరిగణించాలని, పనుల్లో జాప్యం జరగడానికి వీల్లేదని స్పష్టం చేశారు
- రాజధాని నిర్మాణంలో ఎదురవుతున్న సవాళ్లు, పనుల ప్రస్తుత దశపై ముఖ్యమంత్రి వారితో చర్చించారు
- నిర్దేశిత లక్ష్యాల మేరకు పనుల్లో వేగం పెంచి, నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడకుండా ముందుకు సాగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనులను రికార్డు సమయంలో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. పనుల పురోగతిపై మంగళవారం ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి, పలు కీలక సూచనలు చేశారు. రాజధాని నిర్మాణాన్ని అత్యంత ప్రాధాన్య అంశంగా పరిగణించాలని, పనుల్లో జాప్యం జరగడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశానికి పురపాలక శాఖ మంత్రి పి. నారాయణతో పాటు సీఆర్డీఏ, ఏడీసీకి చెందిన ఉన్నతాధికారులు, నిర్మాణ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లు హాజరయ్యారు. రాజధాని నిర్మాణంలో ఎదురవుతున్న సవాళ్లు, పనుల ప్రస్తుత దశపై ముఖ్యమంత్రి వారితో చర్చించారు. అమరావతిలో చేపట్టాల్సిన పనుల - మిగతా 2 లో

# సంపాదకీయం

## అగ్రరాజ్య ఆటలో భారత్ ఒడ్డున పడేనా

ఆదర్శాలు, ఆర్థిక ప్రయోజనాలు.. ఈ రెండిటినీ విడదీసి చూస్తే అసలు విషయాలు అర్థంకావు. ఆదర్శాలకు అనేక ముసుగులు ఉంటాయి. ఒక్కోదాన్ని తొలగించుకుంటూ వెళ్తే తప్ప అసలు ప్రయోజనాలను పసిగట్టలేం. ఆధిపత్యం చేజారిపోతున్నప్పుడు ముసుగులు తీసేసి ఎట్లా మాట్లాడుతారో తెలుసుకోవాలంటే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వైపే చూడాలి! స్వేచ్ఛావాణిజ్యం గురించి ప్రపంచానికి ఒకనాడు అమెరికా చెప్పిన ఆదర్శాలు అన్నీఇన్నీ కావు. ఇప్పుడు అవన్నీ పక్కకుబెట్టి అసంబద్ధ ఏకపక్ష సుంకాలతో దేశాలను శాసించటం ట్రంప్‌కు ఒక విధానంగా మారిపోయింది. భారత్ వస్తువులపై 50 శాతం సుంకాలను విధించి తనది అసలుసిసలైన నయాసామ్రాజ్యవాద పోకడగా నిరూపించుకున్నారు. దీన్ని ఎదుర్కోటానికి మోదీ ప్రభుత్వం కిందామీదా పడుతోంది. విదేశాంగ విధానానికి సంబంధించి ఇటీవల కాలంలో ఎన్నడూ ఎరుగని సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది.గడచిన 25 ఏళ్లుగా అమెరికా అండను పొందటమే ప్రధానంగా భారత విదేశాంగ విధానం రూపుదిద్దుకుంది. ఆర్థికంగా, సాంకేతికంగా, సైనికశక్తి పరంగా అనూహ్యవేగంతో దూసుకుపోతున్న చైనాను నిలువరించటానికి అమెరికాకు భారత్ కావాల్సి వచ్చింది. దక్షిణాసియాలో సైతం పెరిగిపోతున్న చైనా ప్రాధాన్యాన్ని నిలువరించటానికి అన్నిరంగాల్లో అమెరికాతో ఇచ్చిపుచ్చుకోవటం భారత్‌కూ వ్యూహాత్మక అవసరమైంది. నిజానికి ఆపరేషన్ సిందూర్ తర్వాత ఆ అవసరం భారత్‌కు ఇంకా ఎక్కువైంది. కానీ పరిస్థితులు భిన్నంగా, అనూహ్యంగా మారిపోతున్నాయి. ఆపరేషన్ సిందూర్ సాఫల్య, వైఫల్యాలపై రక్షణ వ్యవహారాల నిపుణులు లోతైన విశ్లేషణలు చేస్తున్నారు. పాకిస్థాన్ ఆయుధ సంపత్తిలో చైనా పాత్ర అందరికీ తెలుసు. కానీ పాక్ యుద్ధతంత్రమూ, దాని అమలూ కూడా చైనా కనుసన్నల్లో నడుస్తోందన్న విషయం ఆపరేషన్ సిందూర్ సందర్భంగా స్పష్టమైంది. యుద్ధం అన్న తర్వాత నష్టాలు ఉంటాయి. అయితే ఆ నష్టాలు సమానంగానో, ఊహించని రీతిలో కాస్త ఎక్కువగానో ఉంటే సమస్యలు మొదలవుతాయి. చైనా వ్యూహాత్మక మద్దతుతో సాగిన యుద్ధంవల్లే అవి వస్తే మన భవిష్యత్తు అడుగులను తీవ్రంగా ప్రభావితం చేసేవిగా ఉంటాయి. భారత్ చుట్టూ చక్రబంధంలా చైనా మారిపోయిన కఠోర పరిస్థితుల్లో ట్రంప్ చర్యలు ఎంత అవమానకరంగా అనిపించినా తాడోపేడో తేల్చుకోటానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేదు. రష్యాతో మైత్రినీ, చమురు కొనుగోళ్లనూ వదులుకోబోమని ఒకవంక చెబుతూనే మరోవైపు చైనాతో కూడా సామరస్యంగా వ్యవహరించటానికే మొగ్గుచూపుతున్నట్లు సంకేతాలు ఇస్తోంది. అందుకే ప్రధాని మోదీ ఈ నెలాఖరులో చైనాలో పర్యటించబోతున్నారు. తమకు ప్రత్యామ్నాయ మార్గాలు కూడా ఉన్నాయని చెప్పటమే భారత్ తక్షణ లక్ష్యంగా కనపడుతోంది.ఒకటి మాత్రం నిజం. చైనా, భారత్, రష్యాలు ఆర్థికంగా సహకరించుకుంటే ట్రంప్ అంచనాలన్నీ తారుమారవుతాయి. అమెరికా ఆర్థిక, సైనిక ఆధిపత్యం మరింత దిగజారుతుంది. అమెరికాకు 75 ఏళ్లల్లో ఎన్నడూ చూడని సవాళ్లు ఎదురవుతాయి. ఇదే జరిగితే యూరప్ దేశాలు అమెరికాకు తానాతందాన అనే పరిస్థితి నుంచి బయటపడొచ్చు. లాటిన్ అమెరికాలో కూడా అమెరికా ఆధిపత్యానికి గండిపడుతుంది. ఇప్పటికే బ్రెజిల్ అమెరికాపై చాలా కోపంగా ఉంది. అమెరికాను ఆధిపత్యధోరణుల కట్టడి చేయటానికి చైనా, భారత్‌లు సమష్టిగా అడుగులు వేస్తే చరిత్ర కొత్త మలుపుతిరుతుంది. ఆ మలుపు అంత సులభం కాదు. అభిలాషతో అన్నీ జరగవు. రెండు దేశాల మధ్య ఇప్పటిదాకా జరిగిన పరిణామాలు, పోటీలు, వివాదాలే అందుకు కారణం.భారత%-%చైనా మధ్య వివాదాలు ఈనాటివి కావు. ఆసియాలో ఆధిపత్యం, నాయకత్వ పాత్రపై రెండు దేశాల మధ్య పెనుగులాటలు 1950ల నుంచే మొదలయ్యాయి. బ్రిటిష్ వలసపాలకులు నిర్ణయించిన సరిహద్దులను అంగీకరించబోమని చైనా, వాటిని యథాతథంగా కొనసాగించాలని భారత్ పట్టుబట్టటంతోనే వివాదం మొదలైంది. 1950ల నాటికే అక్సాయిచిన్ ప్రాంతం చైనా నియంత్రణలో ఉంది. ఉపగ్రహచిత్రాల్లేని ఆ రోజుల్లో అక్సాయిచిన్‌లో జనసంచారం, సైనికుల కదలికల గురించి తెలుసుకునే అవకాశమే లేదు. అందుకే ఆ నియంత్రణ గురించి భారత్‌కు చాలా ఆలస్యంగా తెలిసింది. 1951లో టిబెట్‌ను చైనా స్వాధీనం చేసుకున్న నాటి నుంచే చైనా కదలికలను సునిశితంగా పరిశీలించటం ఎంతోకొంత మొదలైంది. అక్సాయిచిన్ ఎడారి ప్రాంతం. లద్దాఖ్ మహారాజు 1865లో దాన్ని స్వాధీనంలోకి తెచ్చుకున్నారు. అంతకుముందు బ్రిటిషు సైన్యం చేతుల్లో సిక్కు రాజ్యం (1846) ఓడిపోయింది. ఆ తర్వాత లద్దాఖ్‌ను లాంఛనంగా స్థానిక మహారాజాకు అప్పగించారు. లద్దాఖ్ తూర్పు ప్రాంతమైన అక్సాయిచిన్‌కు సంబంధించి సరిహద్దులేవీ అప్పటికి స్పష్టంగా లేవు. అక్సాయిన్ ఎడారికి ఇవతల ఉన్న కారాకోరం పర్వతాలనే లద్దాఖ్‌కు తూర్పు సరిహద్దుగా భావించేవారు. కానీ 1865లో లద్దాఖ్ మహారాజు సర్వే జరిపించి ఈశాన్యంలో పర్వతాలకు అవతలున్న అక్సాయిచిన్ ఎడారి ప్రాంతాన్ని కూడా లద్దాఖ్‌లో కలిపి సర్వేపటాన్ని సిద్ధంచేశారు. సర్వేయర్ జాన్సన్‌కు లంచమిచ్చి పటాన్ని అలా తయారుచేశారన్న ఆరోపణలు అప్పుడే వచ్చాయి. బ్రిటిష్ ఇండియా ప్రభుత్వం జాన్సన్‌ను ఉద్యోగం నుంచి తొలగించింది. సరిహద్దును విస్తరించటం బ్రిటిష్ ఇండియా ప్రభుత్వానికి అప్పట్లో ఇష్టంలేదు. జాన్సన్‌కు లద్దాఖ్ మహారాజు తర్వాతి కాలంలో ప్రధానమంత్రి పదవిని కట్టబెట్టారు. రష్యా సామ్రాజ్య విస్తరణను దృష్టిలో పెట్టుకుని కారాకోరం పర్వతశ్రేణిని సరిహద్దుగా నిర్ణయిస్తే బాగుంటుందని భావించిన బ్రిటిషు పాలకులు ఆ మేరకు మాకార్ట్నీ మక్డోనాల్డ్ పేరిట 1890ల్లో సర్వేపటాన్ని తయారుచేసి చైనాకు పంపారు. దానిపై చైనా స్పందించలేదు. స్పందన లేకపోవటాన్ని ఆమోదంగా భావించి 1941 వరకూ దాన్నే సరిహద్దుగా పరిగణించారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో సోవియట్ సైనికదళాలు అక్సాయిచిన్ ఉత్తరభాగంలో సంచరిస్తున్నాయని తెలుసుకుని జాన్సన్ ప్రతిపాదించిన మేరకు లద్దాఖ్ సరిహద్దుని మళ్లీ విస్తరిస్తూ నిర్ణయం తీసుకున్నారు. జాన్సన్ సరిహద్దు గురించి చైనాకు అధికారికంగా ఎప్పుడూ తెలపలేదు. లద్దాఖ్ సరిహద్దును తాము ఆమోదించలేదని 1954లో చైనా స్పష్టంచేసింది.అరుణాచల్ ప్రదేశ్‌పై వివాదానికీ చాలా చరిత్ర ఉంది. 1911లో చైనాలో వచ్చిన విప్లవాన్ని ఆసరాగా తీసుకుని అప్పటి టిబెట్ పాలకుడు స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నారు. చైనా ప్రభుత్వం దాన్ని అంగీకరించలేదు. బ్రిటన్ మాత్రం టిబెట్‌ను బఫర్‌జోన్‌గా ఉపయోగించుకోవాలని భావించింది. చైనా, టిబెట్, బ్రిటిషు ఇండియా ప్రభుత్వాల మధ్య చర్చలు జరిగాయి. ఏకాభిప్రాయం కుదరలేదు. ఇదే సమయంలో టిబెట్%-% ఇండియా మధ్య సరిహద్దుని ఉత్తరాన 60 మైళ్ల ముందుకు జరిపి హిమాలయాల హద్దుగా ఒక ప్రతిపాదన చేశారు.

# ఆధార్‌ను ప్రామాణిక పత్రంగా భావించలేం

మొదటిపేజీ తరువాయి – ప్రమాదం ఉందని పిటిషనర్ తరఫున హాజరైన కపిల్ సిబల్ వాదించారు. ముఖ్యంగా సరైన పత్రాలు సమర్పించని వారి ఓట్లు పోతాయని అన్నారు. 2003లో జాబితాలో చేరిన ఓటర్లు సైతం తాజాగా పత్రాలు సమర్పించాల్సి వస్తుందని తెలిపారు. ఒకవేళ సమర్పించకపోతే ఓటు హక్కు కోల్పోతారని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ డేటా ప్రకారం 7.24 కోట్ల మంది పత్రాలను సమర్పించినట్లు కపిల్ సిబల్ తెలిపారు. ఇంకా 65లక్షల మంది పేర్లను ఓటర్ జాబితా నుంచి తొలగించారని ఆరోపించారు. వీరందరిపై సరైన విచారణ చేపట్టకుండానే మరణాలు, వలస పేరిట తొలగించారని అన్నారు. ఎలాంటి సర్వే చేపట్టలేదని ఈసీ సైతం అఫిడవిట్ దాఖలు చేసిందని బెంచ్?కు చెప్పారు.ఓ నియోజకవర్గంలో 12 మంది చనిపోయారని ఈసీ చెప్పిందని, కానీ వారు బతికే ఉన్నారని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. మరో ఘటనలో బతికే ఉన్న వ్యక్తులను చనిపోయినట్లు ప్రకటించారని కోర్టుకు చెప్పారు. అయితే ఇటువంటి ప్రక్రియలో కొన్ని లోపాలు ఉంటాయని ఈసీ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేదీ ధర్మాసనానికి విన్నవించారు. చనిపోయిన వ్యక్తులను బతికి ఉన్నట్లు, సజీవంగా ఉన్నవారిని చనిపోయినట్లు ప్రకటించడం వంటి తప్పిదాలను సరిదిద్దవచ్చని, ప్రస్తుతం విడుదు చేసింది కేవలం ముసాయిదా జాబితా మాత్రమేనని అన్నారు.ఈ క్రమంలోనే స్పందించిన సర్వోన్నత న్యాయస్థానం వాస్తవాలు, గణాంకాలతో సిద్ధంగా ఉండాలని ఎన్నికల సంఘానికి సూచించింది. ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభానికి ముందు ఎంతమంది ఓటర్లు ఉన్నారు.గతంలో నమోదైన మరణాల సంఖ్య ఎంత? ఇప్పుడు నమోదు చేసిన మరణాల సంఖ్య ఎంత? వంటి వివరాలపై ప్రశ్నలు ఎదురయ్యే అవకాశం ఉందని చెప్పింది.బిహార్ ఎస్ఐఆర్‌లో సామూహికంగా ఓటర్లను తొలగిస్తే తక్షణమే జోక్యం చేసుకుంటామని జులై 29న సుప్రీం కోర్టు పేర్కొంది. అంతకుముందు జులై 10న చేపట్టిన విచారణ సందర్భంగా బిహార్‌లో ఎస్ఐఆర్‌ను నిర్వహించాలన్న ఈసీ నిర్ణయంపై స్టే విధించేందుకు సుప్రీం నిరాకరించింది. అదేవిధంగా ప్రాథమిక పత్రాలుగా ఆధార్, రేషన్ కార్డుతో పాటు స్వయంగా ఓటర్ ఐడీ కార్డును పరిగణనలోకి తీసుకోవాలని చెప్పింది.కాగా, బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ఇప్పటికే పూర్తవ్వగా ఈ నెల 1న ముసాయిదా జాబితాను ప్రచురించారు. ఈ ప్రక్రియ చేపట్టక ముందు రాష్ట్రంలో మొత్తం నమోదిత ఓటర్ల సంఖ్య 7.9 కోట్లుగా ఉండగా, ముసాయిదాలో అది 7.24 కోట్లకు తగ్గింది. సెప్టెంబర్ 30న తుది జాబితాను ప్రకటించనుంది. ఈ క్రమంలోనే ఈసీ తీరుపై ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేస్తున్నాయి.

# ట్రంప్ టారిఫ్ దెబ్బ.. అమెరికాలో మోతెక్కిపోతున్న ధరలు!




మొదటిపేజీ తరువాయి – ట్రంప్ ప్రభుత్వం విధించిన కొత్త సుంకాలు అమెరికాలో సామాన్య ప్రజల జేబులకు చిల్లు పెడుతున్నాయి. ఈ నిర్ణయం వల్ల ఒక్కో అమెరికన్ కుటుంబంపై ఏటా సగటున 2,400 డాలర్లు (సుమారు రూ.2.11 లక్షలు) అదనపు భారం పడనుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నెల 7 నుంచి ఈ కొత్త టారిఫ్‌లు అమల్లోకి రావడంతో దేశవ్యాప్తంగా నిత్యావసర వస్తువుల ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి.దీని ప్రభావం ఇప్పటికే మార్కెట్‌లో స్పష్టంగా కనిపిస్తోంది. వాల్‌మార్ట్, అమెజాన్ వంటి ప్రఖ్యాత రిటైల్ దుకాణాల్లో వస్తువుల ధరలు అమాంతం పెరిగాయి. పాత ధరల స్టిక్కర్లపైనే కొత్త ధరల స్టిక్కర్లను అతికించి అమ్ముతున్నారు. మెర్సిడెస్ చాండ్లెర్ అనే మహిళ వాల్‌మార్ట్‌లో పెరిగిన ధరల గురించి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో ఈ విషయం వైరల్‌గా మారింది. ఒక కోటు ధర 6.98 డాలర్ల నుంచి 10.98 డాలర్లకు, బ్యాక్‌ప్యాక్ ధర 19.97 డాలర్ల నుంచి 24.97 డాలర్లకు పెరిగిందని ఆమె తన పోస్టులో పేర్కొన్నారు. దుకాణంలో ఎక్కడ చూసినా ఇలాంటి పరిస్థితే కనిపిస్తోందని ఆమె వాపోయారు.భవిష్యత్తులో ధరలు మరింత పెరుగుతాయనే ఆందోళనతో, వినియోగదారులు అవసరమైన వస్తువులను ముందుగానే కొనుగోలు చేస్తున్నారు. ఏ వస్తువుల ధరలు పెరిగే అవకాశం ఉందో తెలుసుకోవడానికి ఏఐ టూల్స్‌ను సైతం ఆశ్రయిస్తున్నారు. రాబోయే రోజుల్లో డైపర్లు, షాంపూలు, స్కిన్‌కేర్ ఉత్పత్తులు, దిగుమతి చేసుకునే మద్యం, కార్లు, వాటి విడిభాగాలు, చైనా నుంచి వచ్చే ఆటబొమ్మల ధరలు కూడా గణనీయంగా పెరగనున్నాయని అంచనాలు వెలువడుతున్నాయి. సగటున ఈ బాదుడు 35 శాతం వరకు ఉండొచ్చని నిపుణులు చెబుతున్నారు.ఈ సుంకాల పెరుగుదల నేపథ్యంలో అమెజాన్, వాల్‌మార్ట్ వంటి దిగ్గజ సంస్థలు తమ దిగుమతులను తాత్కాలికంగా నిలిపివేసినట్టు తెలుస్తోంది. ప్రస్తుతానికి సరుకులను పంపవద్దని ఎగుమతిదారులకు సూచించినట్టు సమాచారం. ఈ పరిణామంతో దుస్తులు, టాయ్‌లెట్ పేపర్ నుంచి టూత్‌పేస్ట్, డిటర్జెంట్ల వరకు అనేక వస్తువుల ధరలు ఇప్పటికే పెరిగాయి.

# మూడు రోజులు ప్రభుత్వ సిబ్బందికి సెలవులు రద్దు



మొదటిపేజీ తరువాయి – ఉండాలి : ఆకస్మిక వరదలు వస్తే ఎయిర్ లిఫ్టింగ్‌కు హెలికాప్టర్లు ఉండేలా చూసుకోవాలని, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందితో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని అధికారులకు రేవంత్ రెడ్డి ఆదేశించారు. మొబైల్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్న ఆయన హైదరాబాద్‌లో వరదలపై హైడ్రా అప్రమత్తంగా వ్యవహరించాలని చెప్పారు. హైదరాబాద్‌లో హైడ్రా సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలని, వరదల ప్రభావంపై ప్రజలు ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ ఆదిశించారు. భారీ వర్షాల సమయంలో ప్రజలు బయటకు రాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, స్కూల్స్, కాలేజీలు, ఐటీ సెక్టార్ ఉద్యోగులకు సంబంధించి అధికారులు తగిన నిర్ణయం తీసుకోవాలని సూచించారు.కలెక్టర్లకు సీఎం దిశానిర్దేశం : జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి, తుమ్మల, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. భారీ వర్షాల దృష్ట్యా ముందస్తు చర్యలపై కలెక్టర్లకు సీఎం దిశానిర్దేశం చేశారు.ఉమ్మడి వరంగల్, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, కుమురంభీం, మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలకు భారీ వర్ష సూచనలు ఉన్నాయి. పలు జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో హెచ్చరికలను జారీచేసింది. బుధవారం కొన్ని ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.యాదాద్రి భువనగిరి, మహబూబాబాద్, హనుమకొండ, జనగామ, వరంగల్ జిల్లాల్లో అతిభారీ వర్షాలు ఉన్నాయని పేర్కొంది. ఐదు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. బుధవారం పెద్దపల్లి, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, సిద్దిపేట, మేడ్చల్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో 9 జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీచేసింది. భారీ వర్షాల సూచన నేపథ్యంలో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని అధికారులు సూచించారు.ఎకో టూరిజం అభివృద్ధి : అంతకు ముందు రేవంత్? రెడ్డి అటవీశాఖపై ఉన్నతాధికా రులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, సీఎం ఓఎస్‌డీ వేముల శ్రీనివాసులు, అధికారులు హాజరయ్యారు. ఎకో టూరిజం అభివృద్ధిపై దృష్టి సారించాలని, అటవీ, రెవెన్యూ భూముల హద్దులు నిర్ధరించాలని సీఎం అధికారులను ఆదేశించారు. జంతువుల దాడి బాధితులకు వేగంగా పరిహారం అందించాలని, అధికారుల ప్రమోషన్లు, అవార్డులకు ప్రతిపాదనలు పంపాలని అన్నారు. అటవీ నిఘా కెమెరాలు ఐసీసీసీకి అనుసంధానం చేయాలని సూచించారు.

# సీఎం రేవంత్ రెడ్డి సర్కార్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత సూటి ప్రశ్న



మొదటిపేజీ తరువాయి – కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై పోరాటం చేస్తున్న కవిత నిన్న తెలంగాణ జాగృతి, యూపీఎఫ్, ఇతర బీసీ నాయకులతో సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ బీసీలను వంచించాలని చూస్తోందని విమర్శించారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తానని తెలిపారు. కలిసి వచ్చే అన్ని వర్గాలతో ముందుకెళ్తానని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయకుండా బీసీలను వంచించాలని చూస్తోందని ఆరోపించారు.రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అయ్యాకే బీసీ రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పడం అంటే బీసీ రిజర్వేషన్లు ఇప్పటికైతే అమలు చేయమని చెప్పడమేనని అన్నారు. ఇదే విషయాన్ని అసెంబ్లీ ఎన్నికల ముందు ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు.బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చి బీసీలను వంచించాలని చూస్తున్న కాంగ్రెస్ కుయుక్తులను ప్రజల ముందు ఎండగడతామని అన్నారు. పార్టీపరంగా 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం అనేది కంటి తుడుపు చర్యేనని ఆమె అన్నారు.

# బండి సంజయ్‌కి కేటీఆర్ లీగల్ నోటీసులు




మొదటిపేజీ తరువాయి – ఆరోపణలు చేశారంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ లీగల్ నోటీసులు పంపారు. కేంద్ర మంత్రిగా ఉండి బాధ్యతారహితంగా మాట్లాడారని మండిపడ్డారు.ఒక ప్రజాప్రతినిధిపై ఇలా అసత్య ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసమని కేటీఆర్ నిలదీశారు. రాజకీయ ఉనికి కోసం ఇలా దిగజారి మాట్లాడటం సరికాదన్నారు. తనకు బండి సంజయ్ వెంటనే క్షమాపణలు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. భవిష్యత్తులోనూ అసత్య ఆరోపణలు చేయకుండా ఉండాలని పేర్కొన్నారు.

# అమరావతి పనులు రికార్డు సమయంలో పూర్తి కావాలి

మొదటిపేజీ తరువాయి – వివరాలను అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి వివరించారు. రాజధానిలో మొత్తం రూ. 81,317 కోట్ల విలువైన పనులను చేపట్టాలని సీఆర్డీఏ ప్రతిపాదించగా, ఇప్పటివరకు రూ. 50,552 కోట్ల విలువైన పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. ప్రధానంగా భవన నిర్మాణాలు, ల్యాండ్ పూలింగ్ స్కీమ్ (ఎల్పీఎస్) పరిధిలో మౌలిక సదుపాయాల కల్పన, ప్రధాన రహదారులు, డక్టుల వంటి ట్రంక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ పనులతో పాటు వరద నియంత్రణ పనుల పురోగతిని సీఎం సమీక్షించారు.నిర్దేశిత లక్ష్యాల మేరకు పనుల్లో వేగం పెంచి, నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడకుండా ముందుకు సాగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

## 2027 నాటికి పోలవరాన్ని పూర్తి చేయడమే లక్ష్యం

మొదటిపేజీ తరువాయి – 2027 డిసెంబర్ నాటికి పోలవరాన్ని పూర్తి చేయడమే లక్ష్యమన్నారు మంత్రి నిమ్మల రామానాయుడు. పోలవరం ప్రాజెక్టు పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారుల్ని ఆదేశించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆయన.. డయాఫ్రం వాల్ పొడవు 1396 మీటర్లకు 500 మీటర్ల నిర్మాణం పూర్తయినట్లు తెలిపారు. అలాగే 3 ట్రెంచ్ కట్టర్లు, 3 గ్రాబర్లలో డయాఫ్రంవాల్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. వరద సమయంలోనూ నిర్మాణ పనులకు ఆటంకం రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే.. రాష్ట్రంలో ఎక్కడా నీటి కొరత ఉండదని మంత్రి నిమ్మల స్పష్టం చేశారు.c

## మరావతిలో బసవతారం ఆసుపత్రికి శంకుస్థాపన



మొదటిపేజీ తరువాయి – ఈ కార్యక్రమానికి టీడీపీ ఎమ్మెల్యే, బసవతారకం ఆసుపత్రి ఛైర్మన్ నందమూరి బాలకృష్ణ, కుటుంబ సభ్యులు హాజరు కానున్నారు. అమరావతి బసవతారకం ఆసుపత్రిని తొలి దశలో 300 పడకల సామర్థ్యంతో నిర్మించనున్నట్టు సమాచారం. ఆ తర్వాత దీన్ని వెయ్యి పడకలకు విస్తరించనున్నారు. వాస్తవానికి 2014-19 మధ్య కాలంలోనే అమరావతిలో క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణానికి అడుగులు పడ్డాయి. అప్పట్లోనే ప్రభుత్వం ఆసుపత్రికి భూమిని కేటాయించింది. అయితే 2019లో వైసీపీ విజయం సాధించడంతో ఆసుపత్రి నిర్మాణ పనులు ముందుకు సాగలేదు. ఇప్పుడు మరోసారి ప్రభుత్వం స్థలం కేటాయించడంతో... ఆసుపత్రి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని భావిస్తున్నారు.

# గుజరాత్ లోని రిలయన్స్ రిఫైనరీని టార్గెట్ చేస్తాం అసిమ్ మునీర్ హెచ్చరిక

**రిలయన్స్ జామ్‌నగర్ రిఫైనరీని లక్ష్యంగా చేసుకుంటామన్న పాక్ ఆర్మీ చీఫ్**

**అమెరికా పర్యటనలో జనరల్ అసీమ్ మునీర్ వివాదాస్పద వ్యాఖ్యలు**

**ఇది అణు బెదిరింపేనని తీవ్రంగా స్పందించిన భారత విదేశాంగ శాఖ**

**ఉగ్రదాడి తర్వాత ఇరు దేశాల మధ్య పెరిగిన ఉద్రిక్తతల నేపథ్యంలో వ్యాఖ్యలు**

మొదటిపేజీ తరువాయి – పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ అసీమ్ మునీర్ తన అమెరికా పర్యటనలో భారత్‌పై తీవ్రమైన వ్యాఖ్యలు చేస్తూ కవ్వింపులకు పాల్పడుతున్నారు. గుజరాత్‌లోని జామ్‌నగర్ లో ఉన్న రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) రిఫైనరీని లక్ష్యంగా చేసుకుంటామని బెదిరించారు. ఈ రిఫైనరీ ప్రపంచంలోనే అతిపెద్ద సింగిల్-సైట్ రిఫైనింగ్ కాంప్లెక్స్‌గా గుర్తింపు పొందింది. అమెరికాలోని ఫ్లోరిడాలో జరిగిన ఒక విందు సమావేశంలో, మునీర్ ఆర్ఐఎల్ ఛైర్మన్ ముఖేష్ అంబానీ చిత్రంతో పాటు ఖురాన్ శ్లోకాన్ని ప్రస్తావిస్తూ ఒక సోషల్ మీడియా పోస్ట్‌ను ప్రస్తావించారు. అంతేకాదు, భారత్ కు అణు హెచ్చరికలు కూడా చేశారు. అమెరికా నేలపై నుంచి మునీర్ చేసిన ఈ వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ వ్యాఖ్యలు పాకిస్థాన్ యొక్క యుద్ధోన్మాద వైఖరిని స్పష్టంగా చూపిస్తున్నాయని భారత్ అభిప్రాయపడింది. కాగా, మునీర్ న్యూక్లియర్ వార్నింగ్ నేపథ్యంలో... భారత్, పాకిస్థాన్ దేశాల సైనిక, అణు సామర్థ్యంపై చర్చ మొదలైంది.

**సైనిక బలం: భారత్ ఆధిపత్యం**

ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్ట్రాటజిక్ స్టడీస్ ప్రకారం, భారత్ సైనిక బలం పాకిస్థాన్ కంటే చాలా ఎక్కువ. భారత్‌లో సుమారు 14 లక్షల మంది సక్రియ సైనిక సిబ్బంది ఉన్నారు, వీరిలో 12.3 లక్షలు ఆర్మీ, 75,500 నౌకాదళం, 1,49,900 వైమానిక దళం, మరియు 13,350 కోస్ట్ గార్డ్‌లో ఉన్నారు. దీనికి విరుద్ధంగా, పాకిస్థాన్‌లో 7 లక్షల కంటే తక్కువ సైనిక సిబ్బంది ఉన్నారు. 5,60,000 మంది ఆర్మీ, 70,000 మంది వైమానిక దళం, మరియు 30,000 మంది నౌకాదళంలో ఉన్నారు. అంతేకాక, భారత్‌లో 25 లక్షల మంది పారామిలటరీ బలగాలు ఉండగా, పాకిస్థాన్‌లో కేవలం 5 లక్షల మంది మాత్రమే ఉన్నారు.

**న్యూక్లియర్ సామర్థ్యం: భారత్ ముందంజ**



రెండు దేశాలు న్యూక్లియర్ ఆయుధాలను కలిగి ఉన్నప్పటికీ, గత 20 ఏళ్ల గణాంకాలను పరిశీలిస్తే... భారత్‌లో 180 న్యూక్లియర్ వార్‌హెడ్‌లు ఉండగా, పాకిస్థాన్‌లో 170 ఉన్నాయని అంచనా. భారత్ అగ్ని-5 క్షిపణులు బహుళ లక్ష్యాలను ఒకేసారి ఛేదించగల మల్టిపుల్ ఇండిపెండెంట్లీ టార్గెటబుల్ రీఎంట్రీ వెహికల్స్ (ఎంఐఆర్‌వీ) సాంకేతికతను కలిగి ఉన్నాయి. అగ్ని-5 రేంజ్ 5,000 నుంచి 8,000 కి.మీ. వరకు ఉండగా, పాకిస్థాన్ యొక్క షాహీన్-3 క్షిపణి రేంజ్ 2,750 కి.మీ. మాత్రమే.

# సమాచార హక్కు చట్టం కింద వచ్చిన దరఖాస్తుకు సమాచారం ఇవ్వాలి

## జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్






**నిర్మల్ :ఆగష్టు 12:తెలంగాణ సేన న్యూస్ :** సమాచార హక్కు చట్టం కింద వచ్చిన దరఖాస్తులన్నింటిని వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, రేపు(బుధవారం) జిల్లాలో రాష్ట్ర సమాచార కమిషన్ బృందం పర్యటన నేపథ్యంలో శాఖల వారీగా ఇప్పటివరకు నమోదైన దరఖాస్తులు, వాటి పరిష్కారం, పెండింగ్ కేసులు తదితర అంశాలను అధికారులు పరిశీలించాలన్నారు. అన్ని శాఖల్లో పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ తప్పనిసరిగా ఉండాలని, 4(1) బి రిజిస్టర్‌ను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. రేపు కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమాచార హక్కు చట్టం దరఖాస్తులపై కమిషన్ బృందం విచారణ చేపడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ స్వచ్ఛతకు సహకరించాలి

## ఈఓ అన్వర్ అలీఖాన్



**ముధోల్:ఆగష్టు 12:తెలంగాణ సేన న్యూస్.** :ముధోల్: గ్రామ స్వచ్ఛతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ముధోల్ గ్రామ పంచాయతీ ఈఓ అన్వర్ అలీ కోరారు.మంగళవారం మండల కేంద్రంలోని ఆయా కాలనీలలో తిరుగుతూ పారిశుధ్య కార్మికులు చేపడుతున్న పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.గ్రామంలో అభివృద్ధితో పాటు పచ్చని వాతావరణం ఏర్పాటు చేయడం తమ బాధ్యతగా అన్ని విధాలుగా కృషి చేస్తున్నామనారు. అంతే కాకుండా వ్యాపారస్తులు,ప్రజలు పర్యావరణానికి హానికలిగించే ప్లాస్టిక్ వ్యర్థాల వాడకం నిషేధించాలని విన్నవించారు. పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా రోజు వారిగా ఆయా వీధుల్లో మురికి కాలువలను శుభ్రం చేయడం,ఇంటింటికి వెళ్తూ చెత్తను సేకరించడం, ప్లాస్టిక్ వ్యర్థాలపై అవగాహన కల్పించడం వంటి పలు విధులను చేపడుతున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఆపన్నహస్తుడు గడ్డం సుభాష్

## సేవా కార్యక్రమాలను అభినందిస్తున్న గ్రామస్తులు



**ముధోల్:ఆగష్టు 12:తెలంగాణ సేన న్యూస్.:** ముధోల్:ఆపద సమయంలో ఆదుకుంటూ అందరికి ఆపన్న హస్తుడిగా నిలుస్తున్నాడు మండల కేంద్రానికి చెందిన గడ్డం సుభాష్.మంగళవారం స్థానిక దివ్యాంగులైన లక్ష్మణ్,మల్లన్న,సంతోష్ కు తన వంతు బాధ్యతగా వాకర్లు,హ్యాండ్ స్టిక్ లని గ్రామ పెద్దల సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సేవలో పాల్గొనడం సంతోషంగా ఉందని తెలిపారు.గత కొన్నేళ్ల నుండి స్థానిక ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సహాయ సహకారాలు అందిస్తుండడం అభినందించదగ్గ విషయమన్నారు.రానున్న రోజుల్లో సైతం ప్రజలకు వారి సేవలందిస్తూ ప్రశంసలు పొందాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు గుంజలోళ్ల నారాయణ,గ్రామ పెద్దలు ఇడే పోల్ల లస్మన్న ,సంజు పటేల్, తన్వీర్, జల్బా, పోషెట్టి,అశోక్,గంగాధర్,ప్రసాద్,ప్రవీణ్,నవీన్,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఎన్నికలు





**భైంసా:ఆగష్టు 12:తెలంగాణ సేన న్యూస్.:** నిర్మల్ జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ పదవుల కోసం ఏకగ్రీవ ఎన్నికలు శాంతియుత వాతా వరణంలో సంస్కార్ స్కూల్లో ఈరోజు జరుప బడ్డాయి. ఇందులో అధ్యక్షులుగా: శ్రీ కదం మోహన్ రావు పటేల్ గారు,ఉపాధ్యక్షులుగా: శ్రీ కదం పర్వాజి ప్రకాష్ గారు, శ్రీ రాటి పోతన్న గారు,జనరల్ సెక్రటరీగా: శ్రీ ఉప్పు రవీందర్ గారు,కోశాధికారిగా: శ్రీ మిట్టపల్లి సాయినాథ్ గారు ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమం నిర్మల్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ శ్రీధర్ రెడ్డి గారు, నిర్మల్ జిల్లా డిస్ట్రిక్ స్పోర్ట్స్ అథారిటీ నుండి సాయి కృష్ణ గారు , తెలంగాణ యోగ అసోసియేషన్ నుండి అబ్జర్వర్గా శ్రీ . గంగాధర్ గారూ పర్యవేక్షణలో ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల యోగా గురువులు, క్రీడాకారులు, అధికారులు, యోగ సభ్యులు ,మాజీ అధ్యక్షులు శ్రీ బాజీరావు బోస్లే గారు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల చేయూత



**తెలంగాణ సేన, :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం శ్రీగిరిపల్లి గ్రామంలో రోడ్డు ప్రమాదంలో మరణించిన ఇస్తారి కుటుంబాన్ని మంగళవారం గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పరామర్శించి ఆర్థిక సహాయంతో పాటు నెలకు సరిపడా నిత్యవసర సరుకులు అందజేశారు ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కుమార్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇస్తారి కుటుంబానికి గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తక్షణ సహాయంగా నెలకు సరిపడే నిత్యవసర సరుకులు అందజేయడం జరిగిందని ప్రభుత్వపరంగా భవిష్యత్తులో వారికి అన్ని విధాల అండగా ఉండే విధంగా ప్రయత్నిస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాసరి వెంకటేష్, నాయకులు చిమ్మి రెడ్డి, పొట్ట కరుణాకర్, అమరేందర్ రెడ్డి,రాజు,మల్లేష్,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాచారంలో శ్రావణ మాసం ప్రత్యేక పూజలు



**తెలంగాణ సేన, :**యాదాద్రి భువనగిరి జిల్లాలోని కాచారం కైలాసపుర శ్రీ రేణుక వాసవి బసవలింగేశ్వర దేవాలయ ఆవరణలో ఆలయ వ్యవస్థాపకులు ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి ఆధ్వర్యంలో పవిత్ర శ్రావణమాసం మూడవ మంగళవారం సందర్భంగా శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం జరిగిన పూజా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వేడుకలకు ప్రత్యేక అతిథులుగా భువనగిరి జిల్లా ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ వాణిజ్య కమిటీ చైర్మన్ కుక్కటపు చంద్రశేఖర్ , గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ ఆడెపు బాలస్వామి పాల్గొన్న కార్యక్రమంలో మార్కండేయ భక్తులు రాజపేట వాస్తవ్యులు ఎక్కల దేవి సోమరాజు పార్వతి దంపతులు సహకారంతో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. శ్రావణమాసం మూడవ మంగళవారం అర్చన, అభిషేకం సందర్భంగా ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామిని పలువురు శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గజ్వేల్ వైశ్య సంఘం నాయకులు గందే సంతోష్ కుమార్, భువనగిరి మహాలక్ష్మి కిరాణం యజమాని దేవరాజు , సినీ నిర్మాత సామ శ్రీధర్ ప్రశాంతి దంపతులు, మిర్యాలగూడ, బుజిలాపురం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి భక్తురాలు సామ లక్ష్మీ, రాజా మార్కండేయ సినిమా మేనేజర్ కాసం రాము గుప్త, రఘునాథ పురానికి చెందిన ఉపాధ్యాయుడు పాండు పాల్గొన్నారు.

# కార్పొరేట్ విద్యాసంస్థల అధిక ఫీజుల భారాన్ని కట్టడిచేయడంలో విఫలమైన రాష్ట్ర సర్కార్

## పాలడుగు శ్రీనివాస్ ఉస్మానియా విద్యార్థి ఉద్యమ నాయకుడు



**హైదరాబాద్:ఆగష్టు 12:తెలంగాణ సేన న్యూస్ :** ఇంటర్నేషనల్ స్కూల్స్ పేర్ల తో అధిక ఫీజులు వసూలు చేస్తున్న నియంత్రించలేని తెలంగాణ ప్రజా ప్రభుత్వం పేపర్ ప్రకటనలకే పరిమితమైంది తప్ప ఆచరణలో మాత్రం ఎక్కడా కూడా అమలు కాలేదు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఇంటర్నేషనల్ 'వరల్డ్ యూనివర్సల్‌బీ గ్లోబల్ పబ్లిక్ ఒలంపియాడ్ ,ఈ టెక్నో కేంబ్రిడ్జ్, ఆక్స్ఫర్డ్, బిర్లా ఓపెన్, ఇలా పేర్లు పెట్టుకునే తెలంగాణ విద్యాశాఖ నుండి ఎలాంటి నియమ నిబంధనలు లేవని స్పష్టంగా విద్యాశాఖ అధికారులు చెప్పుతున్నప్పటికీ హైదరాబాద్ కేంద్రంగా ఇలా ఇంటర్నేషనల్ వగైరా పేరుతో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్గిరి సంగారెడ్డి జిల్లాల పరిధిలోని విచ్చలవిడిగా ఈ ఇంటర్నేషనల్ ఓకే రా పేరుతో వేలాది స్కూల్లు నెలకొల్పారు ఇట్టి స్కూళ్లకు ఎలాంటి పర్మిషన్స్ లేకున్నా యదేచ్చగా విద్యా శాఖ నుండి గుర్తింపు లేకుండా అక్రమంగా స్కూల్స్ ను తెరిచి లక్షలలో ఫీజులు దండుకుంటున్నారు నాణ్యమైన విద్య మరియు ఇంటర్నేషనల్ స్థాయిలో మా స్కూల్లో మౌలిక సదుపాయాలు సెంట్రల్ ఏసి ఇలా వినూత్నంగా విద్యను వ్యాపారంగా మార్చి కోట్లాది రూపాయలను సంపాదిస్తున్నారు ఈ విద్యా వ్యాపారానికి ఈ తెలంగాణలో ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు బలైతున్నారు పేరెంట్స్ యొక్క బలహీనతను అడ్డుపెట్టుకొని ఈ ఇంటర్నల్ స్కూల్స్ పేరుతో అధిక ఫీజులను వసూలు చేస్తూ దీనికి తోడు మరియు ఎక్స్ట్రా కరెక్యూమ్ పేరుతో ఈవెంట్స్ పేరుతో అదనంగా ఫీజులు వసూలు చేయడం వీటికి నియంత్రణ లేకపోవడం స్కూల్ శజమానులకు అడ్డు అదుపు లేకుండా పోయింది మీ పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే మాలాంటి ఇంటర్నేషనల్ వగైరా లాంటి స్కూల్లో మాత్రమే నాణ్యమైన ఎడ్యుకేషన్ ఉంటుందని వ్యాపార ప్రకటనలు చేస్తూ సోషల్ మీడియా వేదికగా టీవీలలో ప్రచారాలు చేస్తూ విద్యను పూర్తిగా విలువలు లేకుండా కేవలం వ్యాపార కోణంలో మాత్రమే చూస్తున్నారు ఇక్కడే నాణ్యమైన విద్య అందుతుందని భ్రమలో విద్యార్థులు తల్లిదండ్రులు నమ్మకంతో తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఇక్కడే నాణ్యమైన విద్య దొరుకుతుందని పరిగెడుతున్నారు ఇలా పరిగెత్తి తన సంపాదించే మొత్తం కూడా పిల్లల చదువుకే కేటాయించి కొన్ని కొన్ని సందర్భాలలో ఈ చదువులకు కోసం ప్రధానంగా మధ్యతరగతి కుటుంబాలు చాలా ఆర్థిక పరిస్థితులు ఎదుర్కొనే స్థితికి వచ్చారు కావున యావత్ విద్యార్థి తల్లిదండ్రుల లోకానికి తెలియజేయునది ఏమనగా కేవలం ఇంగ్లీష్ మీడియం ఇంటర్నేషనల్ స్కూల్లోనే దొరుకుతుందని అపోహనుండి బయటపడండి మీకున్న బడ్జెట్ లోనే మంచి స్కూలును వెతుక్కోండి కానీ ఈ కార్పొరేట్ మాయలో పడకుండా ఉండండి ప్రతి ఒక పేరెంట్స్ గొప్పలకు పోకుండా పక్కవారితో పోల్చుకోకుండా మీ ఆర్థిక స్థాయికి అనుకూలంగా స్కూల్స్ ను ఎంచుకోండి ఇలా మీలో మార్పు వస్తే తప్ప ఈ ఇంటర్నేషనల్ వగైరా లాంటి స్కూల్ యొక్క విద్యా వ్యాపారాన్ని అడ్డుకట్ట వేయలేము ఇకనైనా మారండి ప్రభుత్వ విద్యను బలోపేతం చేసే దిశగా మీరు ఓట్లు వేసే సమయంలో ఓట్లు అడిగే క్రమంలో మీరు ఏది ఆశించకుండా మీ పిల్లల భవిష్యత్తు కోసం సరైన నాణ్యమైన మరియు విలువలతో కూడుకున్న విద్యను అందించేందుకు పాలకుల మీద ఒత్తిడి తీసుకొచ్చే విధంగా ప్రయత్నం చేయండి గ్రామానికి ఒక గల్లికొక మంచి పాఠశాలను ఏర్పాటు చేసే దిశగా కృషి చేయాలని రాష్ట్ర బడ్జెట్లో విద్యకు అధిక శాతం నిధులు కేటాయించే విధంగా ప్రభుత్వం మీద ఒత్తిడి పెంచడం ఇలా అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ నాణ్యమైన విలువలతో కూడుకున్న ఇంగ్లీష్ మీడియం స్కూల్ లను అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వాలు కూడా దృష్టి కేంద్రీకరించాలని విజ్ఞప్తి చేస్తున్నాం

# తప్పు చేసినట్లు నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధం

## తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదు

## కొత్తపల్లి ఇసుకతో ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి కి ఎలాంటి సంబంధం లేదు

## నల్లకుంటను భూకబ్జా నుంచి కాపాడింది అనిరుద్ రెడ్డే

## చౌడూరులో నేను కొన్న భూమిపై బిఆర్ఎస్ నేతలు తప్పుడు ఫిర్యాదులు చేశారు

## రాజకీయాల కోసం తప్పుడు ఆరోపణలు చేస్తే కోర్టుకు ఈడ్చి పరువు నష్టం వేస్తా

## జిల్లా కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే సోదరుడు దుశ్యంత్ రెడ్డి స్పష్టీకరణ



**తెలంగాణ సేన, జడ్చర్ల :** నియోజకవర్గంలో ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ఈరోజు వరకు ఇసుక రవాణాలో ఎక్కడా జోక్యం చేసుకోలేదని,, నల్లకుంట చెరువును కబ్జాల నుండి కాపాడిందే అనిరుధ్ రెడ్డి అని, నవాబుపేట మండలం చౌడూరు లో కొనుగోలు చేసిన 4.18 గుంటల భూమిలో ఎలాంటి వివాదాలు లేకపోయినా తనపై తప్పుడు ఫిర్యాదులు చేసారని ఎమ్మెల్యే సోదరుడు మాజీ జిల్లా అధికార ప్రతినిధి జనంపల్లి దుష్యంత్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి హయాంలో 30 ఏళ్లు వెనక్కి పోయిన జడ్చర్ల అభివృద్ధిని అనిరుధ్ రెడ్డి 30 ఏళ్లు ముందుకు తీసుకుపోయారని కితాబిచ్చారు. మరో ముప్పై ఏళ్ల పాటు అనిరుధ్ రెడ్డి ఎమ్మెల్యే కొనసాగాలని జడ్చర్ల ప్రజలు కోరుకుంటున్నారని అభిప్రాయపడ్డారు.

జడ్చర్ల కేంద్రంలో జనంపల్లి దుష్యంత్ రెడ్డి ఈరోజు మీడియా సమావేశం నిర్వహించి, ఇటీవలి కాలంలో తనపై జరుగుతున్న అసత్య ప్రచారాలపై వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగానే దుష్యంత్ రెడ్డి మాట్లాడుతూ, జడ్చర్ల నియోజకవర్గంలో తాను ఎప్పుడూ అవినీతికి పాల్పడలేదని, ఏ విషయంలోనూ తప్పు చేయలేదని స్పష్టంగా చెప్పగలనని అన్నారు. కొందరు టిఆర్ఎస్ (బిఆర్ఎస్) పార్టీకి చెందిన వ్యక్తులు స్వలాభం కోసం నాపై ఆధారంలేని ఆరోపణలు చేసి, బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. తప్పుడు ప్రచారాలు మూడు అంశాల ను గురించి తనపై తన సోదరుడు అనిరుధ్ రెడ్డి పై ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. దీనిలో మొదటి అంశం కొత్తపల్లి వాగు ఇసుక తరలింపు విషయం గూర్చి కొందరు, ఎమ్మెల్యే గారి ప్రమేయంతో కొత్తపల్లి వాగు నుంచి ఇసుక తరలింపు జరుగుతోందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వాస్తవానికి కొత్తపల్లిలో ప్రైవేట్ పట్టా భూమిలో సంబంధిత యజమానులు మైనింగ్ డిపార్ట్మెంట్ నుండి అనుమతి పొంది, జిల్లా కలెక్టర్ ద్వారా %చీూజ% తీసుకొని పూర్తిగా లీగల్‌గా ఇసుక తరలింపు చేయడం జరిగిందని చెప్పారు.ఇది ప్రైవేట్ భూమి ఎమ్మెల్యే గారికి ఏ విధమైన సంబంధం లేదని దుష్యంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. రెండవది జడ్చర్ల నల్లకుంట భూకబ్జా ఆరోపణ,జడ్చర్లలో నల్లకుంట ఎక్కడుందో తనకు తెలియదని, దానితో తనకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి గారు, ఎమ్మెల్యే అయిన రెండు నెలల్లోనే నల్లకుంట భూకబ్జా విషయంపై కలెక్టర్ గారికి లేఖ రాసి చర్యలు కోరారని, అధికారులు నోటీసులు జారీ చేయగా కబ్జాదారులు కోర్టుకు వెళ్లారని చెప్పారు. కోర్టు ఆదేశాలు వారికి వ్రాయతిరేకంగా రావడంతో అధికారులతో ఒక కమిటీ వేసి నల్లకుంట ఎఫ్టీఎల్ లో కబ్జా చేసిన కట్టిన ప్రహరీ గోడలు తొలగించారని, ఈ వ్యవహారానికి తనకు ఎలాంటి సంబంధం లేదని ఆయన వివరించారు. మూడవ అంశం భూమి వివాదం మరియు ప్రాణహాని ఫిర్యాదు,నా కంపెనీ గ్లోబలైన్ హాస్పిటలిటీ %ూూ జూక్% కంపెనీ పేరిట, సర్వే నెంబర్ల ప్రకారం 4.18 గుంటల భూమిని చట్టబద్ధంగా కొనుగోలు చేశానని,ఈ భూమికి పక్కన హైదరాబాద్ రైతులు 8 ఎకరాల భూమి కొనుగోలు చేశారు, ఈ రెండుట భూముల సర్వే నెంబర్లు ఒక్కటే నని చెప్పారు. దాని యొక్క ప్రహరీని చౌడూరు గ్రామానికి చెందిన బావిని శ్రీనివాసులు, బావిని రాజు, బావిని జనార్ధన్ , బావిని ఓంనాథ్, బిజ్జలి మధు, బిజ్జలి చంద్రయ్య, బిజ్జలి శీను, బిజ్జలి కృష్ణయ్య తొలగించినందుకు వారిపై రైతులు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ విషయంగా తనపై ఎలాంటి ఆరోపణలూ లేవని, కానీ కొందరు దురుద్దేశపూర్వకంగా జిల్లా ఎస్పీ, %ణ×+, ఎ=జ% వద్ద తన వల్ల ప్రాణహాని ఉందంటూ ఫిర్యాదు చేశారని తెలిపారు. దీనిపై ఏ అధికారి విచారణకు పిలిచినా తాను హాజరుకాగలనని,ఈ 4.18 గుంటల భూమి విషయంలో తాను ఏదైనా తప్పు చేసినట్లు తేలితే, దానిని ప్రభుత్వానికి ఉచితంగా రాసి ఇచ్చేస్తాను" అని సవాల్ చేసారు.. ఇది ముమ్మాటికి రాజకీయ కుట్ర ప్రయత్నం, ఈ తప్పుడు ప్రచారాల వెనుక ఉన్నది బిఆర్ఎస్ నేతల కుట్రే, ఎమ్మెల్యే గారిని, నన్ను రాజకీయంగా దెబ్బతీయాలనే ఉద్దేశ్యంతో ఈ అపప్రథలు పుట్టిస్తున్నారన్నారు. ప్రజలు నిజానిజాలు అర్థం చేసుకుంటారని ఆశాభావంవ్యక్తం చేశారు.

# నాణ్యతలేని కల్తీ విత్తనాలు, ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు

## వైద్య సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలి,

## జిల్లా (ఇన్చార్జి) కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో



**మహబుబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఆగష్టు 12:** నాణ్యతలేని కల్తీ విత్తనాలు, ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, వైద్య సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు (ఇన్చార్జి) కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, మంగళవారం జిల్లా (ఇన్చార్జి) కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో జిల్లాలోని కేసముద్రం మండల కేంద్రంలో విస్తృతంగా పర్యటించారు,రైతులకు నాణ్యత లేని కల్తీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు, మండల కేంద్రంలోని ఓలం బస్వరాజం ఎరువుల షాపులో ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు, ఎరువుల స్టాక్ వివరాల రిజిస్టర్ ను, ఆన్లైన్ ద్వారా కేటాయించిన స్టాక్ వివరాలు, ఎరువుల తేదీ తదితర అంశాలను ఆయన స్వయంగా పరిశీలించారు, ప్రస్తుత సీజన్కు అనుగుణంగా రైతులకు ఎరువులు విత్తనాలు అందించాలని కృత్రిమ కొరత సృష్టించకూడదని ఆయన సంబంధిత డీలర్లు ఆదేశించారు, ఆన్లైన్ ద్వారా మాత్రమే రైతుల వివరాలు సేకరించి ఎరువులను విత్తనాలను విక్రయించాలన్ని విక్రయించిన ఎరువులకు సంబంధించి కచ్చితంగా బిల్లులు ఇవ్వాలని ఆయన సూచించారు, షాపు ముందు ఎరువుల స్టాక్ వివరాల బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రస్తుతం వానకాలం సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని క్షేత్రస్థాయిలో సంబంధిత వైద్య సిబ్బంది ఆరోగ్య సేవలు అందించాలని, పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది సమన్వయం తో కలిసి పని చేయాలని, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, మాత శిశు మరణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, కేంద్రంలో తగినన్ని మందులు సిద్ధంగా ఉంచుకోవాలని, ప్రజలకు,సీజనల్,అనుగుణంగా అందించే వైద్య కార్య క్రమాలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని సూచించారు,కేసముద్రం మున్సిపల్ పరిధిలో పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని, డంపింగ్ యార్డ్, అంతర్గత పనులు పూర్తి చేయాలని సూచించారు,పట్టణ అభివృద్ధికి ప్రతి ఒక్కరి సహాయం తీసుకుని ముందుకు సాగాలని ఆయన సంబంధిత అధికారులకు సూచించారు, ఈ కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు సిబ్బంది తదితరులు ఉన్నారు.


# కేంద్రీయ విద్యాలయంలో సైన్స్ ప్రతిభ చాటిన విద్యార్థులు




**మహబుబాబాద్ టౌన్ తెలంగాణ సేన ఆగష్టు 12 :** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో మంగళవారం 6వ 9వ,10వ విద్యార్థులు సైన్స్ ప్రతిభ ను చాటారు. మెగా టింకరింగ్ డే ఈ సందర్భంగా చెత్తను తొలగించే (వాక్యూమ్ క్లీనర్) పరికరాలను తయారు చేశారు. మూడు గ్రుపులుగా ఉండి 12 మంది విద్యార్థులు ఈ పరికరాన్ని కనిపెట్టారు. ఇంచార్జీ ప్రిన్సిపల్ ముఖేష్ కుమార్ ఆదేశానుసారం తో ఈ,కార్యక్రమం,నిర్వహించాగాసీనియర్ ఉపాధ్యాయులు రీటా చౌహాన్ విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించి, అభినందించారు. విద్యార్థులు మరింత ప్రతిభ చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయుడు విద్యాసాగర్, కంప్యూటర్ ఉపాధ్యాయుడు సయ్యద్ పాషా ఉన్నారు.

# అయ్యప్ప స్వామి ఆలయం వార్షికోత్సవానికి ముస్తాబు

## ఆలయంలో కొనసాగుతున్న శ్రావణమాసం పూజలు



**తెలంగాణ సేన :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ లోని హరిహర పుత్ర అయ్యప్ప స్వామి ఆలయం వార్షికోత్సవ వేడుకలు విజయవంతం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షులు ఎర్రం శ్రీనివాస్ అన్నారు మంగళవారం గజ్వేల్ అయ్యప్ప ఆలయంలో నాచారం దేవస్థానం డైరెక్టర్ జగ్గయ్యగారి శేఖర్ సీనియర్ నాయకుడు బొగ్గుల సురేష్ తో కలిసి ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎర్రం శ్రీనివాస్ మాట్లాడుతూ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి కరుణాకటాక్షాలతో అందరూ బాగుండాలని, గజ్వేల్ లో వెలసిన శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు బుధవారం అనగా 13- 8- 2025 రోజున ఉదయం నుండి రాత్రి వరకు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు మహా అన్నప్రసాదం అందజేయడం జరుగుతుందని ఈ వేడుకల్లో పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని కోరారు ఈ కార్యక్రమంలో పురోహితులు నంద బాల శర్మ, ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు లగిశెట్టి దుర్గం, ప్రధాన కార్యదర్శి బచ్చు రవీందర్, సంయుక్త కార్యదర్శి పోలిశెట్టి శ్రీనివాస్, కోశాధికారి నారాయణరెడ్డి, సభ్యులు కైలాస ప్రశాంత్,వెంకటేష్, ఉమేష్,భక్తులు తదితరులు పాల్గొన్నారు

# రాహుల్ గాంధీ అరెస్ట్ ను తీవ్రంగా ఖండించిన - బుడిగె శ్రీకాంత్

## జమ్మికుంట యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బుడిగె శ్రీకాంత్



**తెలంగాణ సేన హుజురాబాద్ ప్రతినిధి ఆగష్టు 12:** ఈ సందర్భంగా వారు మాట్లాడుతూబీ రాహుల్ గాంధీ అరెస్టు ఈసీ,బీజేపీల కుమ్మక్కుకు మరో సాక్ష్యం అని మండిపడ్డారు. ఇండియా కూటానికి చెందిన 300 మందికి పైగా ఎంపీలు చేపట్టిన నిరసనలు పోలీసులు అడ్డుకోవడం చాలా హీనమైన చర్య అని, మీ అరెస్టులు ప్రజాస్వామ్య విలువలు పై జరిగిన దాడిగా భావిస్తున్నామని అన్నారు. రాజ్యాంగం ప్రతి పౌరుడు కి శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కల్పించిందని ఆ హక్కును అడ్డుకునే అధికారం ఎవరికి లేదన్నారు. ఎలక్షన్ కమిషన్ మోడీ అమిత్ షా కనుసన్నాలో నడుస్తుందనీ, ఇటీవల రాహుల్ గాంధీ 2024 లో జరిగిన పార్లమెంటు ఎలక్షన్ పై అనేక అనుమానాలు ఉన్నాయని మీడియా సమావేశం పెట్టి విషయాలను చెప్పడం జరిగిందనీ, కర్ణాటక రాష్ట్రంలోని మహాదేవ్ అనే నియోజకవర్గంలో 40 మందితో 6 నెలలు రాహుల్ గాంధీ యొక్క టీం వర్క్ పని చేసిందనీ, అక్కడ ఎన్నీ దొంగ ఓట్లు ఉన్నాయని, అక్కడ ఎంతమంది ఓటర్లు ఉన్నారని తెలుసుకున్నారన్నారు. లక్ష దొంగ ఓట్లను గుర్తించారని, ఒకే ఇంటి నెంబరుతో దాదాపు పదివేల దొంగ ఓట్లను సృష్టించారని తెలిపారు. ఇలాంటి సంఘటనలు జరుగుతున్న భారత ఎన్నికల కమిషన్ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై అనుమానం వ్యక్తం చేశారు.

# న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం బార్ కౌన్సిల్ ఎన్నికల బరిలో....



**తెలంగాణ సేన:** హైకోర్టు న్యాయవాది నర్రి స్వామిలి రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదుల పరిష్కరించాలని అనేక సామాజిక ఉద్యమాలు కార్యక్రమాలు నిర్వహిస్తున్న తెలంగాణ సామాజిక చైతన్యత రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అఖిల భారతీయ న్యాయవాద సంయుక్త ఆదివక్త మంచ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్రి స్వామి చౌటుప్పల్ కోర్టు కి వచ్చిన సందర్భంగా బార్ అసోసియేషన్ నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొనీ నారాయణపురం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ రాబోయే తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికల్లో న్యాయవాదుల సమస్యలు పరిష్కారం కోసం యువకులు రాజకీయ చైతన్యం కోసం న్యాయవాదులు కూడా రాజకీయ రంగంలో రాణించాలని అఖిల భారతీయ స్థాయిలో న్యాయవాదులను చైతన్య పరుస్తున్నాం కాబట్టి తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి న్యాయవాది మీ యొక్క మొదటి ప్రాధాన్యత ఓటును మాకు వేసి గెలిపించవలసిందిగా ప్రార్థిస్తున్నామని తెలియజేశారు

# రోజూ రాత్రి పూట నిద్రకు ముందు గ్లాస్ పసుపు పాలను తాగండి.. చెప్పలేనన్ని లాభాలు కలుగుతాయి..!



పసుపును మనం నిత్యం వంటల్లో వేస్తూనే ఉంటాం. దీన్ని ఎంతో కాలంగా మనం వంటి ఇంటి పదార్థంగానే కాక ఔషధంగా కూడా ఉపయోగిస్తున్నాం. గాయాలు అయినప్పుడు ఎక్కువగా పసుపు రాస్తుంటారు. పసుపును మనం నిత్యం వంటల్లో వేస్తూనే ఉంటాం. దీన్ని ఎంతో కాలంగా మనం వంటి ఇంటి పదార్థంగానే కాక ఔషధంగా కూడా ఉపయోగిస్తున్నాం. గాయాలు అయినప్పుడు ఎక్కువగా పసుపు రాస్తుంటారు. దీంతో యాంటీ సెప్టిక్‌లా పనిచేస్తుంది. గాయం త్వరగా మానడమే కాకుండా, ఇన్‌ఫెక్షన్ అవకుండా అడ్డుకుంటుంది. ఇదే కాకుండా పసుపుతో ఇంకా ఎన్నో లాభాలు కలుగుతాయి. అలాగే పాలను కూడా చాలా మంది రోజూ తాగుతూనే ఉంటారు. అయితే రాత్రి పూట పాలలో పసుపును కలిపి తాగితే ఎన్నో లాభాలను పొందవచ్చని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. పసుపు కలిపిన పాలనే గోల్డెన్ మిల్క్ అని కూడా పిలుస్తారు. ఈ మిశ్రమం పలు వ్యాధులనుతగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తుంది. రాత్రి పూట ఈ పాలను తాగడం వల్ల అనేక వ్యాధులనునయం చేసుకోవడంతోపాటుపలుఆరోగ్య ప్రయోజనాలు కూడా కలుగుతాయి.

**వాపులు, నొప్పులు..**

పసుపు పాలలో శక్తివంతమైన యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. అందువల్ల ఈ పాలను సేవిస్తే కణజాల స్థాయిలో వాపులు తగ్గిపోతాయి. ముఖ్యంగా ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది. నొప్పులు, వాపుల నుంచి ఉపశమనం లభిస్తుంది. పసుపు పాలను తాగడం వల్ల శరీరంలో అంతర్గతంగా ఏర్పడే వాపులు సైతం తగ్గిపోతాయి. దీంతో గుండె పోటు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. పసుపులో అనేక యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. దీంతో కణాలకు జరిగే నష్టం నివారించబడతుంది. చర్మ కణాలు ఆరోగ్యంగా ఉంటాయి. వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. చర్మం కాంతివంతంగా మారి మృదువుగా ఉంటుంది. యవ్వనంగా కనిపిస్తారు. ముఖంపై ఉండే మొటిమలు, మచ్చలు తొలగిపోతాయి. చర్మం ఆరోగ్యంగా ఉంటుంది.

**రోగ నిరోధక శక్తికి..**

పసుపు కలిపిన పాలలో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ, యాంటీ మైక్రోబియల్ గుణాలు ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. దీని వల్ల సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. ముఖ్యంగా దగ్గు, జలుబు వంటి వ్యాధులు తగ్గుతాయి. ఇన్‌ఫెక్షన్ల నుంచి ఉపశమనం లభిస్తుంది. వైరస్‌లు, బ్యాక్టీరియాలపై శరీరం పోరాటం చేస్తుంది. గొంతు నొప్పి, ఇతర శ్వాసకోశ సమస్యలను తగ్గించుకోవచ్చు. పసుపు కలిపిన పాలను తాగితే జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. పైత్య రసాలు సరిగ్గా ఉత్పత్తి అవుతాయి. మనం తిన్న ఆహారంలో ఉండే కొవ్వులను శరీరం సులభంగా జీర్ణం చేస్తుంది. అజీర్తి, తగ్గుతాయి. పసుపు కలిపిన పాలను తాగుతుంటే ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మైండ్ రిలాక్స్ అయి మానసిక ప్రశాంతత లభిస్తుంది. నిద్ర చక్కగా పడుతుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. నిద్రలేమి నుంచి బయట పడవచ్చు.

**మెదడు పనితీరుకు..**

పసుపులో ఉండే కర్‌క్యుమిన్ మెదడు పనితీరును మెరుగు పరుస్తుంది. నాడీ మండల  గా ఏర్పడేలా చేస్తుంది. దీంతో మెదడు యాక్టివ్‌గా పనిచేస్తుంది. ఉత్తేజంగా ఉంటారు. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయి. మతిమరుపు తగ్గుతుంది. కర్‌క్యుమిన్ యాంటీ డిప్రెసెంట్‌గా కూడా పనిచేస్తుంది. అందువల్ల పసుపు పాలను తాగితే మూడ్ మారుతుంది. డిప్రెషన్ నుంచి బయట పడవచ్చు. ఇలా పసుపు పాలు మనకు అనేక విధాలుగా మేలు చేస్తాయి. కనుక ఈ పాలను రోజూ తాగుతుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది

# నిమ్మ ఆకులను ఇలా వాడితే ఎన్నో ప్రయోజనాలు.. ఏయే వ్యాధులకు పనిచేస్తాయంటే..?

నిమ్మకాయలనువాడడం వల్ల ఎన్ని ఉపయోగాలు కలుగుతాయో అందరికీ తెలిసిందే. నిమ్మరసం అనేక ప్రయోజనాలను అందిస్తుంది. దీన్ని మనం తరచూ వంటల్లో ఉపయోగిస్తూనే ఉంటాం. నిమ్మరసాన్ని కొందరు నేరుగా తాగుతారు. నిమ్మకాయలను వాడడం వల్ల ఎన్ని ఉపయోగాలు కలుగుతాయో అందరికీ తెలిసిందే. నిమ్మరసం అనేక ప్రయోజనాలను అందిస్తుంది. దీన్ని మనం తరచూ వంటల్లో ఉపయోగిస్తూనే ఉంటాం. నిమ్మరసాన్ని కొందరు నేరుగా తాగుతారు. కొందరు గోరు వెచ్చని నీటిలో కలిపి సేవిస్తుంటారు. ఆయుర్వేద ప్రకారం నిమ్మరసం మనకు అనేక లాభాలను అందిస్తుంది. ఎంతో పురాతన కాలం నుంచే నిమ్మకాయలను ఆహారంగా, ఔషధంగా ఉపయోగిస్తున్నారు. అనేక సంప్రదాయ వైద్య విధానాల్లోనూ నిమ్మకాయలను వాడుతారు. అయితే కేవలం నిమ్మకాయలు మాత్రమే కాదు, నిమ్మ ఆకులు కూడా మనకు ఎంతగానో మేలు చేస్తాయి. ఈ ఆకుల్లో అనేక ఔషధ గుణాలు ఉంటాయి. ఇవి వ్యాధులను తగ్గిస్తాయి. మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. నిమ్మ ఆకులతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు.

**చక్కని నిద్రకు..**

నిమ్మ ఆకులను నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను వడకట్టి అందులో కొద్దిగా తేనె కలిపి తాగవచ్చు. ఈ మిశ్రమం అద్భుతమైన ఔషధంగా పనిచేస్తుంది. దీన్ని ఒక కప్పు మోతాదులో రోజుకు 2 సార్లు తాగవచ్చు. మీరు రోజూ తాగే టీ, కాఫీలకు బదులుగా ఈ నిమ్మ ఆకుల టీని సేవిస్తుంటే ఎంతగానో ఉపయోగం ఉంటుంది. నిమ్మ ఆకుల టీలో అల్లం రసం కలిపి కూడా తాగవచ్చు. దీంతో ఇంకా ఎక్కువ లాభాలు కలుగుతాయి. నిమ్మ ఆకుల టీని సేవిస్తుంటే ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మైండ్ రిలాక్స్ అవుతుంది. మెదడు ప్రశాంతంగా మారుతుంది. మానసిక ఆరోగ్యం మెరుగు పడుతుంది. రాత్రి పూట చక్కగా నిద్ర పడుతుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. నిద్రలేమి నుంచి బయట పడవచ్చు. ఈ ఆకుల టీని సేవిస్తుంటే నాడీ మండల వ్యవస్థ ప్రశాంతంగా మారుతుంది. టెన్షన్ మొత్తం తగ్గిపోయి ప్రశాంతంగా మారుతారు. అలసట, నీరసం తగ్గిపోతాయి.



**జీర్ణ వ్యవస్థ ఆరోగ్యానికి..**

నిమ్మ ఆకుల టీని సేవిస్తుంటే జీర్ణక్రియ మెరుగు పడుతుంది. తిన్న ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. గ్యాస్, అసిడిటీ, కడుపు ఉబ్బరం నుంచి ఉపశమనం లభిస్తుంది. ఆకలి పెరుగుతుంది. నిమ్మ ఆకుల్లో అనేక యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్ బారి నుంచి శరీరానికి జరిగే నష్టాన్ని నివారిస్తాయి. కణాలు ఆరోగ్యంగా ఉంటాయి. దీంతో గుండె పోటు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. ఈ ఆకులతో తయారు చేసిన టీని రోజుకు 2 సార్లు తాగుతుంటే సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. ఆ ఆకుల్లో ఉండే విటమిన్ సి రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. దీంతో దగ్గు, జలుబు తగ్గిపోతాయి. జ్వరం నుంచి త్వరగా కోలుకుంటారు.

**ఇలా వాడాలి..**

నిమ్మ ఆకులు ఆరోగ్యానికి మేలు చేసేవే అయినప్పటికీ వీటిని చెట్టు నుంచి తెంపిన తరువాత శుభ్రంగా కడగాలి. లేదంటే ఆకులపై ఉండే కృత్రిమ ఎరువులు, క్రిమి సంహారక మందుల తాలూకు అవశేషాలు మన శరీరంలోకి వెళ్లే ప్రమాదం ఉంది. వీలైనంత వరకు సేంద్రీయ పద్ధతిలో పె  సేకరించిన ఆకులను వాడితే మంచిది. కొందరికి సిట్రస్ అలర్జీ ఉంటుంది. అలాంటి వారు నిమ్మ ఆకులను ఉపయోగించకూడదు. గర్భిణీలు, వాడే ముందు డాక్టర్ సలహా తీసుకోవడం మంచిది. నిమ్మ ఆకులతో తయారు చేసిన నీళ్లను స్నానం చేసే నీటిలో పోసి ఆ నీటితో స్నానం చేస్తే శరీరం తాజాగా మారుతుంది. చెమట వాసన రాకుండా ఉంటుంది. నిమ్మ ఆకులను పేస్ట్‌లా చేసి అందులో కొద్దిగా తేనె కలిపి ఆ మిశ్రమాన్ని ముఖానికి రాసికాసేపుఅయ్యాకకడిగేయాలి.ఇలాచేస్తుంటేముఖంని      గారి ంపునుసంతరించుకు ంటు ంది. నిమ్మ ఆకుల పేస్ట్‌లో పెరుగు కలిపి జుట్టుకు రాస్తుంటే జుట్టు రాలడం తగ్గిపోతుంది. శిరోజాలు ఒత్తుగా పెరిగి దృఢంగా మారుతాయి. కాంతివంతంగా కనిపిస్తాయి. ఇలా నిమ్మ ఆకులతో అనేక ప్రయోజనాలను పొందవచ్చు

# నాలుక పగలకుండా ఉండాలంటే పైనాపిల్ పండ్లను అసలు ఎలా తినాలి..?



వీటితో కలిగే లాభాలు ఏమిటి..? పైనాపిల్ పండ్లు మనకు దాదాపుగా ఏడాది పొడవునా అన్ని సీజన్లలోనూ అందుబాటులో ఉంటాయి. ఈ పండ్లను నేరుగా తినలేరు. కానీ జ్యూస్ చేసుకుని మాత్రం తాగుతారు. అయితే పైనాపిల్ పండ్లను నేరుగా తింటే నాలుక పగిలినట్లు అవుతుంది. పైనాపిల్ పండ్లు మనకు దాదాపుగా ఏడాది పొడవునా అన్ని సీజన్లలోనూ అందుబాటులో ఉంటాయి. ఈ పండ్లను నేరుగా తినలేరు. కానీ జ్యూస్ చేసుకుని మాత్రం తాగుతారు. అయితే పైనాపిల్ పండ్లను నేరుగా తింటే నాలుక పగిలినట్లు అవుతుంది. అందుకనే ఈ పండ్లను నేరుగా తినేందుకు ఇష్టపడరు. పైనాపిల్ పండ్లలో బ్రొమెలెయిన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది ప్రోటీన్లను జీర్ణం చేస్తుంది. అందుకనే ఈ పండ్లను తింటే నాలుక పగిలినట్లు అవుతుంది. అయితే ఇలా జరగకుండా ఉండాలంటే ఈ పండ్ల ముక్కలపై కాస్త ఉప్పు చల్లి తినాలి. లేదా పైనాపిల్ ముక్కలను పెనంపై కాస్త వేయించి రోస్ట్‌లా చేసి తినాలి. దీంతో బ్రొమెలెయిన్ ప్రభావం తగ్గుతుంది. నాలుక పగలదు. ఇక పైనాపిల్ పండ్లను రోజూ ఒక కప్పు మోతాదులో తినాలని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. దీంతో అనేక లాభాలు కలుగుతాయని అంటున్నారు.

**నాన్ వెజ్ సులభంగా జీర్ణం..**

పైనాపిల్ పండ్లలో ఉండే బ్రొమెలెయిన్ అనే ఎంజైమ్ మనం తిన్న ఆహారాన్ని జీర్ణం చేసేందుకు సహాయం చేస్తుంది. ముఖ్యంగా ప్రోటీన్లను త్వరగా జీర్ణం అయ్యేలా చేస్తుంది. అందువల్ల నాన్ వెజ్ వంటి ఆహారాలను తింటే సులభంగా జీర్ణం అయ్యేందుకు గాను పైనాపిల్ ముక్కలను తినాలి. ఈ పండ్లను తింటే అజీర్తి తగ్గుతుంది. ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. అలాగే గ్యాస్, కడుపు ఉబ్బరం, అసిడిటీ వంటి సమస్యలు ఏర్పడకుండా ఉంటాయి. పైనాపిల్ పండ్లను రోజుకు ఒక కప్పు మోతాదులో తింటే మనకు రోజుకు కావల్సిన విటమిన్ సిలో 100 శాతం లభిస్తుంది. ఇది యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తుంది. ఇన్‌ఫెక్షన్లు, వ్యాధుల నుంచి శరీరాన్ని రక్షిస్తుంది.

**ఎముకల దృఢత్వానికి..**

పైనాపిల్ పండ్లలో ఉండే బ్రొమెలెయిన్ అనే ఎంజైమ్ యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలను సైతం కలిగి ఉంటుంది. అందువల్ల ఈ పండ్లను తింటే శరీరంలో ఉండే వాపులు, నొప్పులు తగ్గిపోతాయి. ముఖ్యంగా ఆర్థరైటిస్ ఉన్నవారికి మేలు జరుగుతుంది. విరిగిన ఎముకలు త్వరగా అతుక్కోవాలంటే పైనాపిల్ పండ్లను రోజూ తింటుండాలి. దీంతో ఎంతో మేలు జరుగుతుంది. పైనాపిల్ పండ్లలో మాంగనీస్ అధికంగా ఉంటుంది. ఇది ఎముకల నిర్మాణానికి దోహదం చేస్తుంది. ఎముకలు దృఢంగా మారేలా చూస్తుంది. పైనాపిల్ పండ్లను రోజూ ఒక కప్పు మోతాదులో తింటే చాలు మనకు రోజుకు కావల్సిన మాంగనీస్ లభిస్తుంది. ఇది ఎముకలను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఈ పండ్లలో విటమిన్ సితోపాటు ఫ్లేవనాయిడ్స్, ఫినోలిక్ యాసిడ్స్ అనబడే యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్ బారి నుంచి కణాలను రక్షిస్తాయి. దీంతో ఆక్సీకరణ ఒత్తిడి, శరీరంలో అంతర్గతంగా ఉండే వాపులు తగ్గుతాయి. దీని వల్ల గుండె పోటు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.

**శ్వాసకోశ సమస్యలకు..**

పైనాపిల్ పండ్లలో ఉండే యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు శ్వాసకోశ సమస్యలను తగ్గిస్తాయి. ముఖ్యంగా సీజనల్ గా వచ్చే దగ్గు, జలుబు, ముక్కు దిబ్బడ వంటి సమస్యల నుంచి ఉపశమనాన్ని అందిస్తాయి. గొంతు, ఊపిరితిత్తుల్లో ఉండే కఫం కరిగిపోతుంది. శ్వాస నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోయి గాలి సరిగ్గా లభిస్తుంది. అయితే పైనాపిల్ పండ్లు ఆరోగ్యకరమే అయినప్పటికీ రోజుకు ఒక కప్పుకు మించి తినరాదు. తింటే సైడ్ ఎఫెక్ట్స్ వచ్చే అవకాశాలు ఉంటాయి. పొట్టలో అసౌకర్యం ఏర్పడుతుంది. కొందరికి పైనాపిల్ పండ్లలో ఉండే బ్రొమెలెయిన్ పడదు. వికారం, వాంతులను కలగజేసే అవకాశాలు ఉంటాయి. అలాంటి వారు కూడా ఈ పండ్లను తినకూడదు

# ఈ సీజన్‌లో అల్లం టీని రోజూ 2 సార్లు తాగాలి.. ఎందుకంటే..?

వర్షాకాలం కారణంగా చాలా మంది శ్వాసకోశ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. దగ్గు, జలుబు, ముక్కు దిబ్బడ, గొంతు నొప్పి వంటి సమస్యలు చాలా మందికి వస్తున్నాయి. వర్షాకాలం కారణంగా చాలా మంది శ్వాసకోశ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. దగ్గు, జలుబు, ముక్కు దిబ్బడ, గొంతు నొప్పి వంటి సమస్యలు చాలా మందికి వస్తున్నాయి. అయితే ఈ సమస్యలకు ఇంగ్లిష్ మెడిసిన్లను వాడాల్సిన పనిలేదు. మన ఇంట్లో ఒక పదార్థంతోనే వీటికి చెక్ పెట్టవచ్చు. అదే.. అల్లం. దీన్ని మనం రోజూ వంటల్లో వేస్తుంటాం. దీంతో వంటలకు చక్కని రుచి, వాసన వస్తాయి. ఆయుర్వేద ప్రకారం అల్లం ఎన్నో ఔషధ గుణాలను కలిగి ఉంటుంది. పలు ఔషధాల తయారీలోనూ దీన్ని ఉపయోగిస్తారు. అల్లంతో టీ తయారు చేసుకుని తాగితే ఈ సీజన్‌లో ఎన్నో లాభాలు కలుగుతాయి. ఒక పాత్రలో తగినంత నీళ్లను తీసుకుని అందులో కొద్దిగా తురిమిన అల్లాన్ని వేసి 10 నిమిషాల పాటు మరిగించాలి. తరువాత వడకట్టి గోరు వెచ్చగా ఉన్నప్పుడు అందులో కాస్త తేనె, నిమ్మరసం కలిపి తాగేయాలి. ఇలా అల్లం టీని రోజుకు 2 సార్లు ఉదయం. సాయంత్రం తాగితే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.వికారం, జీర్ణ సమస్యలకు..అల్లం టీని తాగడం వల్ల వికారం, వాంతికి వచ్చినట్లు ఉండడం వంటి సమస్యలు తగ్గిపోతాయి. ప్రయాణంలో వాంతులు కాకుండా ఉండాలన్నా లేదా గర్భిణీలు వాంతులను ఆపాలన్నా అల్లం టీని తాగితే ఉపశమనం లభిస్తుంది. క్యాన్సర్ కోసం కీమో థెరపీ చేయించుకునేవారికి తరచూ



సులభంగా కదులుతుంది. దీని వల్ల అజీర్తి ఉండదు. కడుపు ఉబ్బరం, గ్యాస్ తగ్గుతాయి. అల్లం టీని తాగితే జీర్ణాశయ ఎంజైమ్‌లు ఉత్పత్తి అవుతాయి. ఇవి మనం తిన్న ఆహారం సులభంగా జీర్ణం అయ్యేలా చేస్తాయి.

# మతిమరుపు సమస్య ఇబ్బందులకు గురి చేస్తుందా..? అయితే ఈ ఆహారాలను రోజూ తినండి..!



వయస్సు మీద పడుతున్న కొద్దీ సహజంగానే ఎవరికైనా సరే మెదడు పనితీరు మందగిస్తుంది. దీంతో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత తగ్గిపోతాయి. ఏ విషయంపై కూడా దృష్టి సారించలేకపోతుంటారు. ముఖ్యంగా మతిమరుపు సమస్య వస్తుంది.  వయస్సు మీద పడుతున్న కొద్దీ సహజంగానే ఎవరికైనా సరే మెదడు పనితీరు మందగిస్తుంది. దీంతో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత తగ్గిపోతాయి. ఏ విషయంపై కూడా దృష్టి సారించలేకపోతుంటారు. ముఖ్యంగా మతిమరుపు సమస్య వస్తుంది. ఇది తీవ్రతరం అయితే అల్జీమర్స్‌కు దారి తీస్తుంది. అయితే కొందరు యుక్త వయస్సులో ఉన్నప్పటికీ మతిమరుపు సమస్యతో బాధపడుతుంటారు. మెదడు పనితీరు మందగించినట్లు అనిపిస్తుంది. దేనిపై కూడా ధ్యాస పెట్టలేకపోతుంటారు. ఏకాగ్రత లోపిస్తుంది. అలాంటి వారు కొన్ని రకాల ఆహారాలను తీసుకుంటే ఎంతగానో మేలు జరుగుతుంది. మతిమరుపు అనేది పలు రకాల కారణాల వల్ల వస్తుంది. విటమిన్లు, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్ల లోపం ఉంటే ఈ సమస్య ఎదురవుతుంది. అందుకు గాను కొన్ని ఆహారాలను తీసుకోవాల్సి ఉంటుంది. ఆ ఆహారాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందా

**.చేపలు..**

చేపలు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉంటాయి. అలాగే డోకోసాహెగ్జాఇనోయిక్ యాసిడ్ (డీహెచ్‌ఏ) కూడా ఉంటుంది. ఇవి మెదడు కణాలను నిర్మించేందుకు సహాయం చేస్తాయి. దీని వల్ల మెదడు, నాడీ మండల వ్యవస్థ కణాలు ఉత్తేజితం అవుతాయి. మెదడు పనితీరు మెరుగు పడుతుంది. జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరుగుతాయి. మతిమరుపు తగ్గుతుంది. వారంలో కనీసం 2 సార్లు చేపలను తింటుంటే మతిమరుపు సమస్య నుంచి బయట పడవచ్చు. అలాగే మనకు అనేక రకాల బెర్రీ పండ్లు సైతం అందుబాటులో ఉన్నాయి. బ్లూబెర్రీలు, స్ట్రాబెర్రీలు, బ్లాక్ బెర్రీలు, రాస్ప్‌బెర్రీలను తరచూ ఆహారంలో భాగం చేసుకోవాలి. ఈ బెర్రీ పండ్లలో ఫ్లేవనాయిడ్స్, ఆంథో సయనిన్స్ అనబడే యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలను కూడా కలిగి ఉంటాయి. ఇవి మెదడుపై పడే ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీంతో మెదడు కణాలు వాపులకు గురి కాకుండా ఉంటాయి. మెదడు కణాలు ఉత్తేజితం చెంది ఆరోగ్యంగా ఉంటాయి. దీని వల్ల మెదడు చురుగ్గా మారుతుంది. మతిమరుపు తగ్గుతుంది.

**ఆకుకూరలు..**

ఆకుపచ్చని కూరగాయలు, ఆకుకూరలను మెదడుకు అద్భుతమైన ఆహారంగా చెప్పవచ్చు. పాలకూర ఈ జాబితాలో ప్రథమ స్థానంలో నిలుస్తుంది. ఇందులో విటమిన్ కె, లుటీన్, ఫోలేట్, బీటా కెరోటిన్ అధికంగా ఉంటాయి. ఇవి మానసిక ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తాయి. మెదడు యాక్టివ్‌గా పనిచేసేలా చేస్తాయి. మెదడు కణాలను నిర్మించేందుకు సహాయం చేస్తాయి. దీంతో జ్ఞాపకశక్తి పెరుగుతుంది. మతిమరుపు తగ్గిపోతుంది. అలాగే వాల్ నట్స్, బాదంపప్పు, గుమ్మడి విత్తనాలు, పొద్దు తిరుగుడు విత్తనాలను రోజూ తింటున్నా కూడా ఎంతో మేలు జరుగుతుంది. వీటిల్లో విటమిన్ ఇ అధికంగా ఉంటుంది. ఇది మెదడు కణాలకు జరిగే నష్టాన్ని నివారిస్తుంది. మెదడు కణాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. వీటిల్లో ఉండే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, జింక్, మెగ్నీషియం, కాపర్, ఐరన్ వంటి పోషకాలు నాడీ మండల వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతాయి. మతిమరుపు సమస్య తగ్గేలా చేస్తాయి.

**కోడిగుడ్డు..**

రోజూ ఒక కోడిగుడ్డును తింటే ఆరోగ్యంగా ఉండవచ్చని, ఎలాంటి రోగాలు రావని వైద్యులు చెబుతుంటారు. అయితే రోజుకు ఒక గుడ్డును తింటే మెదడు సైతం ఆరోగ్యంగా ఉంటుంది. యాక్టివ్‌గా పనిచేస్తుంది. కోడిగుడ్లలో కోలిన్ ఉంటుంది. ఇది అసిటైల్ కోలిన్ అనే న్యూరోట్రాన్స్‌మిటర్‌ను ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. దీని వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుంది. మానసిక ఆరోగ్యం మెరుగు పడుతుంది. గుడ్లలో ఉండే విటమిన్లు బి6, బి12, ఫోలేట్ వయస్సు మీద పడడం వల్ల మెదడు కణాలు క్షీణించే రేటును తగ్గిస్తాయి. దీంతో మెదడు ఎల్లప్పుడూ ఉత్తేజంగా ఉంటుంది. మతిమరుపు తగ్గిపోతుంది. అయితే కోడిగుడ్డులో ఉండే పచ్చని సొనను తింటేనే ఈ లాభాలు కలుగుతాయి. అలాగే పసుపు కూడా మెదడు ఆరోగ్యానికి మేలు చేస్తుంది. పసుపు కలిపిన పాలను తాగుతుంటే మెదడు ఆరోగ్యంగా ఉండడమే కాకుండా మెదడు కణాలు నిర్మాణమవుతాయి. దీంతో మతిమరుపు తగ్గుతుంది. జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరుగుతాయి. ఇలా పలు ఆహారాలను తరచూ తీసుకుంటుంటే మతిమరుపు సమస్యను తగ్గించుకోవచ్చు

# అసలు మునగాకులను ఎలా తినాలి..? వీటిలో ఏమేం లాభాలు కలుగుతాయి..?



కూరగాయలు, ఆకుకూరలు అంటే మనకు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నవే కనిపిస్తాయి. కానీ మన చుట్టూ పరిసరాల్లో ఉండే వాటి గురించి అంతగా ఆలోచించం. నిజానికి అలాంటి కూరగాయలు లేదా ఆకుకూరల్లోనే అనేక ఔషధ గుణాలు ఉంటాయి. కూరగాయలు, ఆకుకూరలు అంటే మనకు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నవే కనిపిస్తాయి. కానీ మన చుట్టూ పరిసరాల్లో ఉండే వాటి గురించి అంతగా ఆలోచించం. నిజానికి అలాంటి కూరగాయలు లేదా ఆకుకూరల్లోనే అనేక ఔషధ గుణాలు ఉంటాయి. అలాంటి వాటిల్లో మునగాకులు కూడా ఒకటి అని చెప్పవచ్చు. వీటిని బయట మార్కెట్‌లో విక్రయించరు. అలా అని చెప్పి వీటిని తినకూడదు అని కాదు, తినవచ్చు, కానీ వాటిని తినాలని చెప్పి చాలా మందికి అవగాహన లేదు, ఆయుర్వేదం దీని గురించి చాలా స్పష్టంగా వివరించింది. మునగాకులు ఏకంగా 300కు పైగా రోగాలను నయం చేస్తాయని ఆయుర్వేద వైద్యులు చెబుతుంటారు. అయితే మునగాకులు ఆరోగ్యకరమైనవి అని తెలుసు కానీ వాటిని ఎలా తినాలి.. అని చాలా మంది సందేహిస్తుంటారు. ఇందుకు ఆయుర్వేద వైద్యులు ఏమని సమాధానాలు చెబుతున్నారో ఇప్పుడు తెలుసుకుందాం.

**మునగాకుల పొడి..**

మునగాకులను ఎండబెట్టి పొడి చేసి ఆ పొడిని ఉపయోగించవచ్చు. దీన్ని మీరు రోజూ తాగే జ్యూస్‌లలో, స్మూతీల వంటి వాటిలో కలిపి తీసుకోవచ్చు. రోజుకు 1 నుంచి 2 టీస్పూన్ల మునగాకు పొడిని వాడితే సరిపోతుంది. ఒక గ్లాస్ యాపిల్ లేదా నారింజ పండ్ల జ్యూస్‌లోనూ ఈ పొడిని కలిపి తీసుకోవచ్చు. సలాడ్స్, రోస్ట్ చేయబడిన కూరగాయలు, పాస్తా, కోడిగుడ్లపై ఈ పొడిని చల్లి తినవచ్చు. సూప్‌లు, చారు, రసం వంటి వాటిల్లోనూ కలిపి తీసుకోవచ్చు. మునగాకుల పొడితో టీ తయారు చేసి తాగవచ్చు. వేడి నీటిలో మునగాకుల పొడిని కలిపి 5 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. తరువాత నీటిని వడకట్టి అందులో రుచికోసం తేనె, నిమ్మరసం కలిపి తాగవచ్చు. మీరు తినే గోధుమ బ్రెడ్ వంటి వాటిపై కూడా ఈ పొడిని చల్లి తినవచ్చు. పెరుగు, ఓట్‌మీల్, చియా విత్తనాలతోనూ కలిపి తినవచ్చు.

**మునగాకులు..**

మీరు తినే సలాడ్స్‌లో మునగాకులను నేరుగా కలిపి తినవచ్చు. రోజూ చేసుకునే కూరల్లోనూ మునగాకులను కొద్దిగా వేయవచ్చు. సూప్‌లలోనూ మునగాకులను వేసి తీసుకోవచ్చు. ఈ విధంగా మునగాకులను లేదా వాటి పొడిని తీసుకుంటే అనేక లాభాలు కలుగుతాయి. అయితే పొడి రూపంలో తీసుకుంటే 1 లేదా 2 టీస్పూన్లకు మించకూడదు. లేదంటే సైడ్ ఎఫెక్ట్స్ సంభవించే అవకాశాలు ఉంటాయి. ఇక మునగాకుల్లో అనేక పోషకాలు ఉంటాయి. ఇవి మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. రోగాలు రాకుండా చూస్తాయి. మునగాకుల్లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. ఈ ఆకుల్లో ఉండే విటమిన్ ఎ కంటి చూపును పెంచడంతోపాటు రోగ నిరోధక వ్యవస్థ బలంగా మారేలా చేస్తుంది. పాలు, పాలకూర వంటి వాటి కన్నా మునగాకుల్లోనే కొన్ని వందల రెట్ల క్యాల్షియం ఎక్కువగా ఉంటుంది.

**లాభాలు..**

క్లోరోజెనిక్ యాసిడ్, బీటా కెరోటిన్ వంటి శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు అధిక మొత్తంలో ఉంటాయి. ఇవి శరీరంలో అంతర్గతంగా వచ్చే వాపులను తగ్గిస్తాయి. దీంతో రక్త నాళాలు ఆరోగ్యంగా ఉంటాయి. గుండె పోటు రాకుండా నివారిస్తాయి. కొలెస్ట్రాల్ అధికంగా ఉన్నవారు రోజూ మునగాకులను తింటుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది. ఈ ఆకులను తినడం వల్ల లేదా పొడిని వాడడం వల్ల షుగర్ లెవల్స్ సైతం తగ్గుతాయి. డయాబెటిస్ అదుపులో ఉంటుంది. ఇలా మునగాకులను తీసుకుంటే అనేక లాభాలను పొందవచ్చు

# సింగరేణి భూగర్భ గనుల్లో భారీ నష్టాలు



భూగర్భ గనులతో సింగరేణి సతమతమవుతున్నది. ఈ గనుల్లో నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు సాధ్యంకాకపోవడంతో ప్రతీయేటా వందలకోట్లనష్టాలనుచవి చూస్తున్నది. సోమవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం రామగుండం డివిజన్-1 పరిఆరేండ్లలో రూ. 2,611 కోట్ల నష్టంభూగర్భ గనులతోసింగరేణి సత్ మత మవుతున్నది. ఈగనుల్లో నిర్దేశించిన బొగ్గుఉత్పత్తిలక్ష్యాలు సాధ్యంకాకపోవడంతోప్రతీయేటా వందలకోట్ల నష్టాలను చవిచూస్తున్నది. సోమవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం రామగుండం డివిజన్-1పరిధిలోని అండర్‌గ్రౌండ్ గనులు గడిచిన ఆరు సంవత్సరాలుగా నష్టాలనే నమోదు చేసుకుంటున్నది. ఆర్జీ-1 డివిజన్‌లోని మూడు అండర్‌గ్రౌండ్ గనుల్లో రూ.2611.12 కోట్ల నష్టాల పాలు కావడంపై ఆందోళన వ్యక్తమవుతున్నది. ఆర్జీ-1 డివిజన్‌లో అత్యంత ఆధునిక పద్ధతిలో బొగ్గు వెలికి తీసే జీడీకే-11గనిలో గడిచిన ఆరేండ్లలో రూ.1,066.99 కోట్ల నష్టం సమకూరింది. 2019-20 నుంచి ఏ ఒక్క ఏడాది కూడా లాభాలు ఆర్జించిన పాపాన పోలేదు. 2019-20లో రూ.128 కోట్లు, 2020-21లో రూ. 181.50 కోట్లు, 2024-25లో రూ.143.59 కోట్లు నష్టాలు చవి చూసింది. జీడీకే 2, 2ఏ గనిలో ఆరేండ్లలో రూ.906.13 కోట్ల నష్టాలు వాటిల్లినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. 2019-20లో రూ.136 కోట్లు, 2023-24లో రూ.174 కోట్లు, 2024-25లో రూ.155.76 కోట్ల నష్టాలు వచ్చాయి. ఈ గనిలో 2019-20లో రూ.70 కోట్లు, 2020-21లో రూ.90 కోట్లు, 2021-22లో రూ.99 కోట్లు, 2022-23లో రూ.125 కోట్లు, 2023-24లో రూ.140 కోట్లు, 2024-25లో రూ.109 కోట్లు ఇలా మొత్తం ఆరేండ్లలో రూ.638 కోట్ల నష్టాలు చవి చూసినట్లు తాజాగా విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. భారీ నష్టాలపాలవుతున్న అండర్‌గ్రౌండ్ గనుల్లో నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు సాధించడానికి సింగరేణి యాజమాన్యం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఓసీపీ గనుల్లో భారీ లాభాలు ఆర్జిస్తున్న సింగరేణి అండర్‌గ్రౌండ్‌లో నష్టాలను భరిస్తున్నది

# 3 నిమిషాల్లోనే కొత్త ఐటీ చట్టం.. చర్చ లేకుండానే కీలక సవరణలు పాస్

63 ఏండ్ల కిందటి పాత ఆదాయ పన్ను (ఐటీ) చట్టం స్థానంలో తెచ్చిన కొత్త ఐటీ చట్టం కేవలం 3 నిమిషాల్లోనే లోక్‌సభ ఆమోదం పొందింది. సోమవారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్.. వ్యక్తులు, సంస్థల ఆదాయ పన్ను నిర్మాణానికి సంబంధించి ప్రవేశపెట్టిన ఈ కీలక చట్ట సవరణలు ఎటువంటి చర్చ లేకుండానే పాసైపోవడం గమనార్హం.లోక్‌సభలో ఆదాయ పన్ను బిల్లు-2025కు ఆమోదం63 ఏండ్ల కిందటి పాత ఆదాయ పన్ను (ఐటీ) చట్టం స్థానంలో తెచ్చిన కొత్త ఐటీ చట్టం కేవలం 3 నిమిషాల్లోనే లోక్‌సభ ఆమోదం పొందింది. సోమవారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్.. వ్యక్తులు, సంస్థల ఆదాయ పన్ను నిర్మాణానికి సంబంధించి ప్రవేశపెట్టిన ఈ కీలక చట్ట సవరణలు ఎటువంటి చర్చ లేకుండానే పాసైపోవడం గమనార్హం.ఇదీ సంగతి..ఆదాయ పన్ను చట్టం-1961 స్థానంలో బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఈ ఏడాది ఫిబ్రవరి 13న ఐటీ బిల్లు (నెం.2) 2025ను లోక్‌సభకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పరిచయం చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఈ బిల్లును సెలెక్ట్ కమిటీ పరిశీలనకు పంపారు. బైజయంత్ పాండా నేతృత్వంలోని 31 మంది సభ్యులుగల కమిటీ.. ఇందులో మార్పులు చేస్తూ పలు సిఫార్సులను సూచించింది. ఈ క్రమంలోనే సదరు సిఫార్సులను బిల్లులో పొందుపర్చడానికి ఈ నెల 8న లోక్‌సభ నుంచి దాన్ని సీతారామన్ ఉపసంహరించిన సంగతి విదితమే. సోమవారం సభకు తీసుకొస్తామని అప్పుడే (గత శుక్రవారం) చెప్పగా, అందుకు తగ్గట్టే వచ్చిన బిల్లు.. కేవలం 3 నిమిషాల్లోనే ఆమోదం పొందడం గమనార్హం. ఓవైపు బీహార్ ఓటర్ల జాబితాకు సంబంధించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)లో అక్రమాలఆరోపణలపై ప్రతిపక్షాలన్నీ పెద్ద ఎత్తున నిరసన తెలుపుతుంటే.. మరోవైపు ఐటీ చట్టంసవరణల బిల్లును ప్రవేశపెట్టి, వాయిస్ ఓట్ ద్వారా మోదీ సర్కారు ఆమోద ముద్ర వేయించింది. దీంతో ఇక ఈ బిల్లు రాజ్యసభకు వెళ్లనున్నది. అక్కడ ఆమోదం పొందిన తర్వాత రాష్ట్రపతి సమ్మతికి పోనున్నది. గ్రీన్ సిగ్నల్ వస్తే చట్టంగా అమల్లోకి రానున్నది. కాగా, ఆదాయ పన్ను (నెం.2) బిల్లుతోపాటు పన్ను చట్టాల (సవరణ) బిల్లుకూ ఒకేసారి ఆమోదం లభించింది. యూనిఫైడ్ పెన్షన్ స్కీం సబ్‌స్క్రైబర్స్‌కు పన్ను మినహాయింపులను కల్పించేదే ఈ బిల్లు




# ఢిల్లీలో టెస్లా సెకెండ్ షోరూం ప్రారంభం




ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజర్గజం టెస్లా అధికారికంగా భారత విపణిలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. గత నెల 15న ఆర్థిక రాజధాని ముంబైలో తొలి షోరూంను ప్రారంభించింది. ఇప్పుడు రెండో షోరూంను కూడా తెరిచింది. దేశ రాజధాని ఢిల్లీ లో తన సెకెండ్ షోరూంను సోమవారం అధికారికంగా ఓపెన్‌చేసింది. ఇందిరాగాంధీఅంతర్జాతీ యవి మానాశ్రయానికి సమీపంలో గల ఏరోసిటీ )లో ఓపెన్ చేసింది.

**మోడల్ కార్ల అమ్మకాలు..**

ప్రస్తుతం ఎలక్ట్రిక్ కార్లలో అత్యధిక అమ్మకాలతో రికార్డు నెలకొల్పిన 'వై' మోడల్ కార్లను భారత వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చింది టెస్లా. (రియర్-వీల్ డ్రైవ్), లాంగ్-రేంజ్ వేరియంట్ కార్లను అమ్మకానికి ఉంచింది.డ్రైవ్ రూ. 59.89 లక్షలు, లాంగ్-రేంజ్ ఆర్‌డబ్ల్యూడీ వేరియంట్ ధరను రూ. 67.89 లక్షలుగా నిర్ణయించింది. వీటి 'ఆన్ రోడ్' ధరల్ని పరిశీలిసే వెర్షన్ ఆన్-రోడ్ ధర రూ. 61.07 లక్షలుకాగా, లాంగ్-రేంజ్ వెర్షన్ ఆన్-రోడ్ ధర రూ. 69.15 లక్షలుగా ఉంది. టెస్లా అధికారిక వెబ్‌సైట్ ప్రకారం, ఇందులో 18 శాతం జీఎస్టీతో సహా రూ. 50,000 అడ్మినిస్ట్రేషన్, సర్వీస్ ఫీజు కూడా ఉంటుంది.ఈ వాహనాలు చైనాలోని టెస్లా షాంఘై గిగాఫ్యాక్టరీ నుంచి దిగుమతయ్యాయి. ఈ వై మోడల్ వేరియంట్ ధరలు అమెరికాలో 44,990 డాలర్లు (భారత కరెన్సీలో రూ.38.63 లక్షలు), చైనాలో 2,63,500 యువాన్ (రూ.31.57 లక్షలు), జర్మనీలో 45,970 యూరోలు (రూ.46.09 లక్షలు)గా ఉన్నాయి. వీటితో పోలిస్తే భారత్‌లోనే ఈ వై మోడల్ ధరలు అధికం కావడం గమనార్హం. దిగుమతి సుంకం, లాజిస్టిక్స్ ఖర్చులే ధర పెరుగుదలకు కారణంగా తెలుస్తోంది

# వాట్సాప్‌లో కుప్పలు తెప్పలుగా మెసేజ్‌లు వస్తున్నాయా..? మీ కోసమే స్పెషల్ ఫీచర్ తెస్తున్న మెటా కంపెనీ..!

వాట్సాప్ యూజర్లకు మెటా కంపెనీ గుడ్‌న్యూస్ చెప్పింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది యూజర్ల కోసం ఎప్పటికప్పుడు సరికొత్త ఫీచర్స్‌ను పరిచయం చేస్తుంటుంది. వాట్సాప్‌లో కుప్పలు తెప్పలు చదవడం ఇబ్బందికరంగా మారుతున్నది. వాట్సాప్ యూజర్లకు మెటా కంపెనీ గుడ్‌న్యూస్ చెప్పింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది యూజర్ల కోసం ఎప్పటికప్పుడు సరికొత్త ఫీచర్స్‌ను పరిచయం చేస్తుంటుంది. వాట్సాప్‌లో కుప్పలు తెప్పలు సందేశాలు వస్తుంటాయి. వాటన్నింటిని చదవడం ఇబ్బందికరంగా మారుతున్నది. ఈ క్రమంలోనే సరికొత్తగా వాట్సాప్‌కు 'క్విక్ రీక్యాప్' పేరుతో కొత్త ఏఐ ఎనేబుల్డ్ ఫీచర్‌ను జోడించబోతున్నది. దాంతో యూజర్లు చదవలేని మల్టిపుల్ మెస్సేజెస్ ముఖ్యాంశాలను తెలుసుకునే అవకాశం ఉంటుంది. అంటే ఒక్కో మెసేజ్‌ను చదవాల్సిన అవసరం లేకుండా అన్నింటిని కలిపి ముఖ్యాంశాలను అందిస్తుంది. ప్రస్తుతం ఈ ఫీచర్ వాట్సాప్ ఆండ్రాయిడ్ బీటా వెర్షన్ 2.25.21.12లో బీటా టెస్టర్లకు అందుబాటులో ఉందని వాట్సాప్ ట్రాకర్ వాబీఇన్ఫో తెలిపింది.

**క్విక్ రీక్యాప్ ఫీచర్ అంటే ?**

వాట్సాప్ చాలాకాలంగా వాట్సాప్‌కు దూరంగా ఉన్న.. మల్టిపుల్ చాట్స్‌లో వచ్చిన అన్‌రీడ్ మెస్సేజెస్‌ను చదవాల్సిన యూజర్లకు ఈ ఫీచర్ ప్రత్యేకంగా చాలా ఉపయోగకరంగా ఉండనున్నది. ఇది వాట్సాప్‌లో ఇప్పటికే ఉన్న 'మెస్సేజెస్ సమరీస్' ఫీచర్‌పై ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం యూఎస్‌లో చాట్ సారంశాన్ని చూపించే ఫీచర్ అందుబాటులో ఉంది. కానీ, క్విక్ రీక్యాప్ ఫీచర్ దాని కంటే చాలా అడ్వాన్స్‌డ్‌గాఉంటుంది.విని యోగ ాలు ఒకేసారి ఐదు చాట్‌లను ఎంచుకొని ఏఐ ద్వారా ప్రతి చాట్ సంక్షిప్త సమాచారాన్ని పొందే అవకాశం ఉంటుంది. వాటి మెస్సేజ్ థ్రెడ్‌ల ద్వారా మళ్లీ మళ్లీ స్క్రోల్ చేయకుండా ఉంటుంది.




# కొత్త డిజైన్లతో పాత బంగారాన్ని మారుస్తున్నారు..! ఇప్పుడు ఇదే ట్రెండ్..!



బంగారం ధర రూ.లక్ష మార్క్‌ను చేరింది. దాంతో బంగారం కొనుగోలుదారులు తమ రూట్‌ను మార్చుకున్నారు. ప్రస్తుతం పాత ఆభరణాలను మార్చుకుంటూ కొత్త నగలను కొనేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రస్తుతం ఈ ట్రెండ్ మరింత బలపడింది. %ాశ్రీ౹ ఆం +శీశ్రీ౹% ఎ బంగారం ధర రూ.లక్ష మార్క్‌ను చేరింది. దాంతో బంగారం కొనుగోలుదారులు తమరూట్‌ను మార్చుకున్నారు. ప్రస్తుతం పాత ఆభరణాలను మార్చుకుంటూ కొత్త నగలను కొనేందుకుప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రస్తుతం ఈ ట్రెండ్ మరింతబలపడింది. ప్రస్తుతంమవిని యోగ దారుల్లో 25శాతం మంది పాత ఆభరణాలనుమార్చుకునేందుకు పోటీపడుతున్నారని, గతంలో ఈ సంఖ్య తక్కువగా ఉండేదని ఆల్ ఇండియా జెమ్ అండ్ జ్యువెలరీ డొమెస్టిక్ కౌన్సిల చైర్మన్ రాజేష్ రోక్డే పేర్కొన్నారు. ఇంద్రియా ఆభరణాల బ్రాండ్ సీఈవో సందీప్ కోప్లీ మాట్లాడుతూ పాత బంగారం మార్పిడి కార్యక్రమం తమ వ్యాపారాన్ని పెంచబోతుందన్నారు. వినియోగదారులుపాతఆభరణాలనువిలువైనఆస్తి గాభావించి. .వాటినికొత్తడిజైన్లతో మార్చు కుంటున్నారన్నారు. పాత బంగారం మార్పిడి ప్రోగ్రామ్ వినియోగదారులు కొత్త ఆభరణాలు కొనుగోలు చేసేందుకు సహాయపడుతుందన్నారు.పాత నగలు ఇచ్చి వినియోగదారులు కొత్త డిజైన్ నగలకు పూర్తిస్థాయి ధర చెల్లించకుండానే తీసుకోవచ్చన్నారు. వినియోగదారులకు కొత్త ఆభరణాలు తీసుకున్నామన్న సంతోషం ఉంటుందని సందీప్ కోప్లీ పేర్కొన్నారు. బంగారం హాల్‌మార్కింగ్ తప్పనిసరి చేయడంతో.. విక్రయిస్తున్న సమయంలో విలువైన ఆస్తిగా భావిస్తున్నారని తెలిపారు. వినియోగదారులు అభిరుచి, సందర్భానుసారంగా కొత్త బంగారం ఆభరణాలను పాతవాటితో రిప్లేస్ చేస్తున్నారని రాజేష్ రోక్డే తెలిపారు. అయితే, ఈ సందర్భంలో అందరూ కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తమ బంగారానికి హాల్ మార్క్ ఉందో లేదో నిర్ధారించుకోవాలన్నారు. నగల మార్పిడి, తయారీ ఖర్చులపై దృష్టి సారించాలన్నారు. పాత బంగారం మార్పిడి ఆఫర్స్‌ను పరిశీలించే సమయంలో జ్యువెల్లర్స్ 22 క్యారెట్స్ కంటే తక్కువ బంగారం ఉన్న సందర్భాల్లో 22 క్యారెట్‌పై పూత వేసిన పాత ఆభరణాల్లో 22 క్యారెట్ కన్నా తక్కువ కరాటేజ్ ఉన్నప్పటికీ, దాన్ని గుర్తించడం కష్టమన్నారు. పాత బంగారం మార్పిడి ఆఫర్లను ఎంచుకునే ముందు వినియోగదారులు ఈ డిడక్షన్లను అర్థం చేసుకోవాలని సూచించారు

## జియో ఫైనాన్స్‌తో ఐటీ ఫైలింగ్ జియో




ఫైనాన్షియల్ యాప్‌తో ఆదాయ పన్ను రిటర్నులు దాఖలు చేయవచ్చునని జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ ప్రకటించింది. మరింత సులభంగా ఐటీ రిటర్నులు దాఖలు చేయాలనే ఉద్దేశంతో ట్యాక్స్‌బడ్డీతో కలిసి ఈ నూతన ఫీచర్ యాప్‌ను అభివృద్ధి చేసినట్టు కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. జియో ఫైనాన్షియల్ యాప్‌తో ఆదాయ పన్ను రిటర్నులు దాఖలు చేయవచ్చునని జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ ప్రకటించింది. మరింత సులభంగా ఐటీ రిటర్నులు దాఖలు చేయాలనే ఉద్దేశంతో ట్యాక్స్‌బడ్డీతో కలిసి ఈ నూతన ఫీచర్ యాప్‌ను అభివృద్ధి చేసినట్టు కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది.వ్యక్తిగతంగా రూ.24 ప్రారంభ ధరతో ఐటీ రిటర్ను చేసుకోవచ్చును.

## మళ్లీ 80 వేల పైకి సెన్సెక్స్.. భారీగా లాభపడ్డ స్టాక్ మార్కెట్లు




దేశీయ స్టాక్ మార్కెట్లు మళ్లీ రివ్వున ఎగిశాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులు కుమ్మరించడం, అమెరికా మార్కెట్లు భారీగా పుంజుకోవడం సూచీలకు కలిసొచ్చింది. చమురు, వాహన, బ్యాంకింగ్ రంగ షేర్లకు మదుపరుల నుంచి లభించిన మద్దతుకు తోడు ఎఫ్ఐఐలు భారీగా పెట్టుబడులు పెట్టడం సూచీల్లో జోష్ పెంచింది. దేశీయ స్టాక్ మార్కెట్లు మళ్లీ రివ్వున ఎగిశాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులు కుమ్మరించడం, అమెరికా మార్కెట్లు భారీగా పుంజుకోవడం సూచీలకు కలిసొచ్చింది. చమురు, వాహన, బ్యాంకింగ్ రంగ షేర్లకు మదుపరుల నుంచి లభించిన మద్దతుకు తోడు ఎఫ్ఐఐలు భారీగా పెట్టుబడులు పెట్టడం సూచీల్లో జోష్ పెంచింది. ఫలితంగా ఇంట్రాడేలో 800 పాయింట్ల వరకు ఎగబాకిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ మళ్లీ 80 వేల మైలురాయిని అధిగమించింది. చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 746 పాయింట్లు ఎగబాకి 80,604.08 పాయింట్ల వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ సైతం 221.75 పాయింట్లు అందుకొని 24,585.05 వద్ద స్థిరపడింది.ూడు నెలల కనిష్ఠ స్థాయికి పడిపోయిన మార్కెట్లకు కాస్త రిలీఫ్ ర్యాలీ వచ్చిందని, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు, ఎఫ్ఐఐల పెట్టుబడులు మార్కెట్లో సెంటిమెంట్‌ను ప్రోత్సహించిందని జియోజిట్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. మార్కెట్లో టాటా మోటర్స్, ఎటర్నల్, ట్రెంట్, ఎస్బీఐ, అల్ట్రాటెక్ సిమెంట్, లార్సెన్ అండ్ టుబ్రో షేర్లు అత్యధికంగా లాభపడగా..భారత్ ఎలక్ట్రాక్స్, భారతీ ఎయిర్‌టెల్, మారుతి షేర్లు నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే రియల్టీ 1.86 శాతం, బ్యాంకింగ్ 1.13 శాతం, హెల్త్‌కేర్ 1.12 శాతం, ఆటో 1.03 శాతం, ఆర్థిక సేవలు 1 శాతం, యుటిలిటీ, సర్వీసెస్, పవర్ రంగ షేర్లకు మదుపరుల నుంచి మద్దతు లభించింది. కానీ కన్జ్యూమర్ డ్యూరబుల్ రంగ షేర్లు నష్టపోయాయి.

## భారీగా తగ్గిన పుత్తడి.. రూ.900 దిగిన తులం ధర



రికార్డు స్థాయికి చేరుకున్న బంగారం ధరలు క్రమంగా దిగొస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో ధరలు భారీగా పడిపోవడంతో దేశీయంగా తులం ధర రూ.900 దిగొచ్చింది. న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో పదిగ్రాముల ధర రూ.1,02,520కి దిగొచ్చింది. న్యూఢిల్లీ, ఆగస్టు 11 : రికార్డు స్థాయికి చేరుకున్న బంగారం ధరలు క్రమంగా దిగొస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో ధరలు భారీగా పడిపోవడంతో దేశీయంగా తులం ధర రూ.900 దిగొచ్చింది. న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో పదిగ్రాముల ధర రూ.1,02,520కి దిగొచ్చింది. రాజకీయ అనిశ్చిత పరిస్థితులు తగ్గుముఖం పట్టడం, స్టాకిస్టులు అమ్మకాలకు మొగ్గుచూపడంతో ధరలు తగ్గుముఖం పట్టాయని ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది. అలాగే 99.5 శాతం స్వచ్ఛత కలిగిన తులం ధర రూ.900 తగ్గి రూ.1,02,100గా నమోదైంది.గడిచిన ఐదు సెషన్లలో పుత్తడి ధర రూ.5,800 ఎగబాకిన విషయం తెలిసిందే. ఇటు హైదరాబాద్‌లో 24 క్యారెట్ కలిగిన తులం బంగారం ధర రూ.760 తగ్గి రూ.1,02,280కి పరిమితమైంది. అంతకుముందు ఇది రూ.1,03,040గా ఉన్నది. అలాగే 22 క్యారెట్ ధర కూడా రూ.700 దిగొచ్చి రూ.1,02,280గా నమోదైంది. రష్యా-ఉక్రెయిన్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధంపై ఒక కొలిక్కి వచ్చే అవకాశాలుండటంతో గ్లోబల్ మార్కెట్లో పుత్తడి ధరలు భారీగా తగ్గాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. పసిడితోపాటు వెండి ధరలు భారీగా తగ్గాయి. కిలో వెండి రూ.1,000 తగ్గి రూ.1,14,000గా నమోదయ్యాయి

## హైదరాబాద్‌లో జెడ్ఎస్ ఆఫీస్



అంతర్జాతీయ మేనేజ్‌మెంట్ కన్సల్టింగ్, టెక్నాలజీ సంస్థయైన జెడ్ఎస్.. భారత్‌లో వ్యాపార విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో నూతన కార్యాలయాన్ని తెరిచింది. 50 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌లో 550-600 మంది వరకు కూర్చోవడానికి వీలుంటుంది. అంతర్జాతీయ మేనేజ్‌మెంట్ కన్సల్టింగ్, టెక్నాలజీ సంస్థయైన జెడ్ఎస్.. భారత్‌లో వ్యాపార విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో నూతన కార్యాలయాన్ని తెరిచింది. 50 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌లో 550-600 మంది వరకు కూర్చోవడానికి వీలుంటుంది. హెల్త్‌కేర్, లైఫ్‌సైన్సెస్ విభాగాల్లో ఇన్నోవేషన్, సర్వీసులను మరింత విస్తరించాలనే ఉద్దేశంతో ఈ సెంటర్‌ను నెలకొల్పినట్టు ఇన్నోవేషన్ కంపెనీ రీజినల్ మేనేజింగ్ ప్రిన్సిపల్ మోహిత్ సూద్ తెలిపారు



# ఉబికే పరువాలతో కైపెక్కిస్తున్న తమన్నా భాటియా




# ఆ గెలుపు నాగ్ దే. టాలీవుడ్ చరిత్రలో తొలిసారి!

అక్కినేని నాగార్జున అకస్మాత్తుగా అన్ని సోషల్ మీడియా వేదికలపైనా వైరల్‌గా మారారు. దీనికి కారణం ఆయన తాజాగా నటించిన కూలీ సినిమా.. త్వరలో ప్రేక్షకుల ముందుకు వస్తున్న ఈ సినిమా ఇప్పటికే టీజర్ లాంచ్ అయి సూపర్ డూపర్ హిట్ అంచనాలను అందుకుంది. మరీ ముఖ్యంగా ఈ టీజర్‌లో నాగార్జున లుక్ బాగా క్లిక్ అయింది. నాగార్జున తన సినీ జీవితంలో తొలిసారిగా విలన్ గా నటిస్తుండడం దక్షిణాది ప్రేక్షకుల్లో ఉత్కంఠ రేకెత్తిస్తోంది. అందుకు తగ్గట్టే నాగార్జున రోల్ అత్యంత స్టైలిష్‌గా తీర్చిదిద్దినట్టు తెలుస్తుండడం కూడా నాగ్ అభిమానుల్లో ఉత్సాహాన్ని పెంచేసింది. నిజానికి ఈ సినిమా లో విలన్ పాత్ర ను ఎంచుకోవడం పట్ల మొదట్లో నాగ్ ఫ్యాన్స్ కొంత ఇబ్బంది పడ్డారనేది నిర్వివాదం. అయితే తాజా అప్ డేట్స్‌తో వారిలో కూడా ఫుల్ జోష్ కనిపిస్తోంది. ప్రీ రిలీజ్ వేడుకలో నాగార్జున తన వయసులో సగం తగ్గిపోయినట్టు కనపడ్డారు. అంతేకాకుండా లోకేష్ కనగరాజ్ తన పాత్రను అద్భుతంగా తీర్చిదిద్దారని నాగ్ స్వయంగా చెప్పడం, తాను నాగార్జున అభిమానినని లోకేష్ అనడం... కూడా అభిమానుల్లో ఉత్సాహం నింపింది. ప్రీ రిలీజ్‌లో నాగ్ లుక్, ఆయన మాటలు ఆయన గురించి తలైవా రజనీ కాంత్ పొగడ్తలు... సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నాయి. ముఖ్యంగా టీజర్‌లో నాగార్జున తన హెయిర్‌ని కుడి చేత్తో వెనక్కి తోస్తున్న బిట్‌ను ఫ్యాన్స్ తెగ వైరల్ చేస్తున్నారు. ఏతావాతా కూలీ సినిమా విడుదలకు ముందే ఒక విషయం మాత్రం రూఢీ అయిపోతోంది. ఈ సినిమాలో నాగార్జున పాత్ర అనూహ్యంగా ఉండబోతోందని. రజనీకాంత్ లాంటి వీర మాస్ హీరోకి సమ ఉజ్జీగా ఆయన తెరపై విలన్ రోల్‌లో దుమ్మురేపనున్నారని. ఈ నేపథ్యంలో మరోసారి సీనియర్ హీరోల పాత్రల ఎంపిక ప్రస్తావనకు వస్తోంది. ప్రస్తుతం నాగార్జునతో పాటు ఆయన సమకాలీకులు ఒకనాటి అగ్ర హీరోలు ముగ్గురు ఇంకా ఫుల్ యాక్టివ్‌గా ఉన్న విషయం తెలిసిందే. అయితే వీరెవరూ సాహసించని రీతిలో నాగార్జున తన పాత్రల ఎంపికను అమాంతం మార్చుకుని ఈ విషయంలో అందర్నీ దాటేశారు. సీనియర్ హీరోల్లో నాగార్జున గ్లామర్‌తో పోటీపడే వారు ఎవరూ లేరనేది నిజం. అయినప్పటికీ వయసుకు తగ్గట్టుగా మార్పు చేర్పులు చేసుకుంటున్నారు. కుబేర సినిమాలో డీ గ్లామర్ రోల్ పోషించి, కూలీ లో ఏకంగా విలన్ పాత్రకు కూడా సై అనడం ద్వారా ఒక నటుడికి సినిమా కలెక్షన్లు, ఇమేజ్‌లు మాత్రమే కాదు వైవిధ్య భరిత పాత్రల్లో నటించానన్న తృప్తి కూడా చాలా అవసరమని చెప్పకనే చెప్పారు. నిన్నే పెళ్లాడుతా తో గ్రీకు వీరుడి ఇమేజ్ తెచ్చుకుని వెంటనే అన్నమయ్య లాంటి పాత్ర చేసిన నాటి దమ్మూ ధైర్యం, తెగువనే ఇప్పటికీ చూపిస్తున్నారు నాగార్జున. అందుకే.. టాలీవుడ్ చరిత్ర లో తొలిసారిగా... సినిమా విడుదల కాకముందే జనం మనసులు గెలిచిన విలన్ అనిపించుకుంటున్నారు.

# డేటింగ్ రూమర్స్‌పై మృణాల్ ఠాకుర్ క్లారిటీ

సినిమా ఇండస్ట్రీలో హీరోహీరోయిన్లు గురించి ఎప్పటికప్పుడు ఏదో ఒక రూమర్ వినిపిస్తూనే ఉంటుంది. కొన్నిసార్లు లైట్ తీసుకునేలా ఉంటాయి. కొన్నిసార్లు మాత్రం నిజమేనేమో అనిపిస్తాయి. కొన్నిరోజుల క్రితం అలా.. ధనుష్-మృణాల్ డేటింగ్‌లో ఉన్నారనే ఓ రూమర్ అందరి దృష్టిని ఆకర్షించింది. ఒకటి రెండు వీడియోలు కూడా వైరల్ కావడంతో ఇది నిజమేనని అందరూ అనుకున్నారు. అయితే ఈ డేటింగ్ పుకార్లకు బలం చేకూర్చేలా కొన్ని విషయాలు కనిపించాయి. ధనుష్ ప్రస్తుతం భార్య నుంచి విడాకులు తీసుకుని సింగిల్‌గానే ఉంటున్నాడు. అలాంటిది మృణాల్.. రీసెంట్‌గా జరిగిన 'సన్ ఆఫ్ సర్దార్ 2' ప్రీమియర్?లో ధనుష్‌తో చనువుగా కనిపించడం, అలానే ధనుష్ అక్కలు ఇద్దర్ని ఇన్ స్టాలో మృణాల్ ఫాలో అవుతుండటం లాంటివి చూసి డేటింగ్ నిజమని అందరూ భావించారు. ఇప్పుడు ఈ విషయమై స్వయంగా మృణాల్ ఠాకుర్ స్పందించింది. అసలెం జరిగిందో చెప్పుకొచ్చింది. 'ధనుష్ నాకు మంచి ఫ్రెండ్ మాత్రమే. ఈ రూమర్స్ గురించి నాకు కూడా తెలుసు. నిజం చెప్పాలంటే అవి చాలా ఫన్నీగా అనిపించాయి. 'సన్ ఆఫ్ సర్దార్ 2' ఈవెంట్‌కి ఆయన రావడాన్ని అందరూ తప్పుగా అర్థం చేసుకున్నారు. ధనుష్-అజయ్ దేవగణ్ క్లోజ్ ఫ్రెండ్స్. అజయ్ పిలిస్తేనే ధనుష్.. ఆ కార్యక్రమానికి వచ్చాడు. మా ఇద్దరం కలిసి కనిపించినంత మాత్రాన మా మధ్య ఏదో జరుగుతున్నట్లు కాదు' అని మృణాల్ చెప్పుకొచ్చింది. సీరియల్స్ నుంచి సినిమా హీరోయిన్‌గా మారిన మృణాల్.. 'సీతారామం' సినిమాతో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చింది. తర్వాత 'హాయ్ నాన్న'తో మరో సక్సెస్ అందుకుంది. కానీ విజయ్ దేవరకొండతో చేసిన 'ఫ్యామిలీ స్టార్' ఫ్లాప్ అయింది. అప్పటినుంచి హిందీలోనే వరస సినిమాలు చేస్తోంది. కానీ అన్నీ ఫెయిల్ అవుతూ వస్తున్నాయి. లేటెస్ట్‌గా వచ్చిన 'సన్ ఆఫ్ సర్దార్ 2' కూడా ఫ్లాప్ అయింది.






# టైగర్ ష్రాఫ్ 'బాఘీ 4' టీజర్ విడుదల

బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'బాఘీ 4'. ఈ సినిమాకు కన్నడ దర్శకుడు ఎ. హర్ష దర్శకత్వం వహిస్తుండగా.. ప్రముఖ నిర్మాత సాజిద్ నడియావాలా కథ, స్క్రీన్‌ప్లేను అందించడంతో పాటు నిర్మాతగా వ్యవహరించాడు. ఈ చిత్రం సెప్టెంబర్ 5, 2025న విడుదల కానుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. 'బాఘీ' ఫ్రాంఛైజీలో రాబోతున్న నాలుగో చిత్రమిది. ఇందులో సంజయ్ దత్ విలన్‌గా నటిస్తుండగా.. సోనమ్ బజ్వా, హర్నాజ్ సంధు ముఖ్య పాత్రల్లో నటించారు.

Editor, printed and owned by Bommarboyina Venkanna, Associate Editor K Rajendra Prasad "office: Amber Nagar, Parshigutta, Secundrabad, Cell.no: 099592 36324, 9912824332